




వైసీపీ అక్రమ తవ్వకాల అనంతరం దొండతిప్ప వద్ద కొండ పరిస్థితి ఇదీ..

కొండలకు గుండు కొట్టేశారు.. బాంబులతో బ్లాస్టింగ్ చేశారు.. చెరువులను చెరిచేశారు.. కాల్వగట్లను కొల్లగొట్టేశారు.. వందలాది ఎక్స్‌కవేటర్లు, వేలాది టిప్పర్లతో సహజ వనరులైన గ్రావెల్, రబ్బీస్, తెల్లచట్టు, రాళ్లు, మట్టిని టన్నులకొద్దీ తరలించేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ఇప్పటివరకు రెండు జిల్లాల్లో దాదాపు రూ.3 వేల కోట్ల రూపాయల విలువైన సహజ వనరులను కొల్లగొట్టేశారంటే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుంది.

కొండల్ని పిండేశారు..!



జక్కంపూడిలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద తవ్వేసిన కొండ

వైసీపీ పాలనలో రెండు జిల్లాల్లో కరిగిన కొండలు





పోలవరం కాల్వగట్టు వద్ద భారీ ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు (సర్కిల్‌లో), గట్టు వెంట టిప్పర్లతో అక్రమ రవాణా (ఇన్‌సెట్‌లో)

- ఇష్టానుసారంగా తవ్వేసిన వైసీపీ మట్టి మాఫియా
- వందలాది ఎకరాల విస్తీర్ణంలోని 27 కొండలు స్వాహా
- ఐదేళ్లలో దాదాపు రూ.3 వేల కోట్ల దోపిడీ
- అధిష్ఠాన పెద్దల ఆశీస్సులతో ప్రజాప్రతినిధుల హల్‌చల్
- పోలవరం కాల్వగట్టు 10 కిలోమీటర్ల మేర తవ్వకం
- భారీ టిప్పర్లతో టన్నులకొద్దీ తరలింపు
- అసైన్డ్ భూములు.. చెరువులనూ వదల్లేదు..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మైలవరం, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో 30కి పైగా కొండలు ఉన్నాయి. వీటిలో పాతికపైగా కొండలపై వైసీపీ ప్రజాప్రతినిధుల కన్ను పడింది. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి మండలస్థాయి నేతల వరకు మైనింగ్ మాఫియాగా ఏర్పడ్డారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనుచరుల ద్వారా ఎక్కడికక్కడ కొండలను చెరబట్టారు. అధికారంలోకి వచ్చిన ఆరో నెల నుంచే కొండలపై వాలిపోయారు. మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అనుమతులు లేకుండానే అనధికారికంగా ఆధీనంలోకి తీసుకున్నారు. అంతేకాదు.. సహజ వనరులను పరిరక్షించాల్సిన అధికార వ్యవస్థలనే అవినీతి కూపంలోకి లాగేశారు. అక్రమ వ్యాపారంలో భాగస్వాములను చేశారు. ప్రజలు ఫిర్యాదు చేసినా, పత్రికల్లో కథనాలు వచ్చినా లెక్క లేకుండాపోయింది. స్థానికులు కోర్టులు వంటి వాటిని ఆశ్రయించినా ఫలితం కనిపించలేదు. చివరికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ను ఆశ్రయించినా ప్రయోజనం లేదు.

కొండలకు గుండు కొట్టేశారు..!

విజయవాడ రూరల్ మండల పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, నున్న, జక్కంపూడి ప్రాంతాల్లో భారీ ఎత్తున కొండలను పిండిచేశారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తరువాత మొదలై నేటి వరకూ నిరాటంకంగా వందలాది ఎకరాలను తవ్వేస్తూనే ఉన్నారు. కొత్తూరు తాడేపల్లిలోని వసంతరాయలతిప్ప, దొండతిప్పలను పిండి చేసేశారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని కొండపావులూరు, వెదురుపావులూరు, ముస్తాబాద, సావారిగూడెం, నున్న, గోపవరపుగూడెం, ముదిరాజుపాలెం, గొల్లనపల్లి, మల్లవల్లి ప్రాంతాల్లోని వందలాది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండలను తవ్వేశారు. విజయవాడ రూరల్, గన్నవరం, బాపులపాడు మండలాల పరిధిలో వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండలను కరిగించటానికి శక్తివంతమైన బాంబులు ఉపయోగించారు. ఇతర రాష్ట్రాల నుంచి డ్రిల్లింగ్ మొబైల్ వాహనాలను తెప్పించి కొండల్లో 20 నుంచి 30 అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేయించి, వాటిలో పేలుడు పదార్థాలను నింపి, బ్లాస్టింగ్ చేశారు. లక్షలాది కోట్ల విలువ చేసే క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను తరలించుకుపోయారు. ఇలా విక్రయించడం ద్వారా మూడు వేల కోట్ల రూపాయల మేర ఆర్జించినట్టుగా తెలుస్తోంది.

పోలవరం కాల్వగట్టును కొల్లగొట్టారు

పోలవరం కుడి కాల్వగట్టు కిలోమీటర్ల వరకూ ఇరిగేషన్ మంత్రికి చెందిన అనుచరులు అనుమతుల్లేకుండా మట్టిని అక్రమంగా తవ్వేశారు. బండారుగూడెం, బల్లిపర్రు, తెంపల్లి, చిక్కవరం, గొల్లనపల్లి, మాదలవారిగూడెం, సూరంపల్లి, నున్న, పాతపాడు, వేమవరం, కొత్తూరు, తాడేపల్లి వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర పోలవరం కుడి కాల్వగట్టును తవ్వేశారు.

చెరువులను చెరపట్టారు

ఎన్టీఆర్ జిల్లాలో 32, కృష్ణాజిల్లాలో 25 చెరువులను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేశారు. వందల ఎకరాల్లో మట్టిని తరలించేశారు. తవ్విన మట్టినంతా ఇటుక బట్టీలకు, రియల్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఎర్రమట్టి ఉన్న భూములను కూడా వదల్లేదు. ప్రభుత్వ భూములను, కొండవాలు వద్ద ఉన్న భూములను వశం చేసుకుంది. రంగన్నగూడెం, సింగన్నగూడెం, మల్లవల్లి ప్రాంతాల్లో 20 మీటర్ల లోతున తవ్వేశారు. చుట్టుపక్కల ప్రాంతాలను ప్రాణాంతక పరిస్థితిలోకి నెట్టేశారు. కొండపావులూరులో అయితే అసైన్డ్ పట్టా భూములను కొనుగోలు చేసి, 50 మీటర్ల లోతున తవ్వేశారు. ఈ మట్టి అంతా ఇటుక బట్టీలకు, రియల్ వెంచర్లకు చేరింది.



వసంతరాయల తిప్ప వద్ద కొండ పరిస్థితి ఇలా..



వెదురుపావులూరు వద్ద కొండపోయి.. గట్టు మిగిలే..



రంగన్నగూడెంలో తాటిచెట్టంత లోతున మట్టి తవ్వకాలు



కొండపావులూరు కొండకు ఇలా గుండు కొట్టారు..

రెండోరోజూ పోస్టల్ బ్యాలెట్

మరో రెండు రోజులు పొడిగించిన ఈసీ

నేడు, రేపు, ఎల్లుండి కూడా వినియోగించుకోవచ్చు

- రెండోరోజు ఎన్టీఆర్‌లో 5,099 మంది, కృష్ణాలో 5,887 మంది ఓటుహక్కు వినియోగం

విజయవాడ/మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి : పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం కూడా కొనసాగింది. ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటుచేసిన కామన్ ఫెసిలిటేషన్ సెంటరుకు ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ఇక మిగతా సెంటర్లలో అంతగా రద్దీ కనిపించలేదు. అయితే, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఎన్నికల సంఘం మరో రెండు రోజులు గడువు పొడిగించింది. సోమ, మంగళ, బుధవారాల్లో కూడా వినియోగించుకునే అవకాశం ఉండటంతో ఆదివారం నాటి ఓటింగ్‌కు ఉద్యోగులు పెద్దగా రాలేదు. ఎన్టీఆర్ జిల్లాలో తొలిరోజు శనివారం కేవలం 4,645 మంది ఉద్యోగులే ఓటుహక్కు వినియోగించుకున్నారు. రెండోరోజైన ఆదివారం 5,059 మంది ఓటు వేశారు. ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కామన్ ఫెసిలిటేషన్ సెంటరులో 1,756 మంది, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 327 మంది, తిరువూరులో 612 మంది, విజయవాడ పశ్చిమలో 250 మంది, సెంట్రల్‌లో 541 మంది, ఆర్వో కార్యాలయంలో 54 మంది, విజయవాడ తూర్పులో 263 మంది, మైలవరం నియోజకవర్గంలోని ఆర్వో కార్యాలయంలో 150 మంది, నందిగామలో 509 మంది, జగ్గయ్యపేటలో 597 మంది ఆదివారం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 20 వేల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా, ఈ రెండు రోజుల్లో 9,704 మంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఓటుహక్కు వినియోగించుకున్నారు.



గుడివాడలోని వీకేఆర్-వీఅండ్‌బీ ఇంజనీరింగ్ కాలేజీలో ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులు

కృష్ణాజిల్లాలో 5,887 మంది

కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో ఆదివారం 5,887 మంది ఉద్యోగులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గన్నవరంలో 602 మంది, గుడివాడలో 1,036 మంది, పెడనలో 600 మంది, మచిలీపట్నంలో 1,317 మంది, అవనిగడ్డలో 843 మంది, పామర్రులో 770 మంది, పెనమలూరులో 719 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఎక్కడా చెల్లని కాసు.. జోగి..!

సొంత నియోజకవర్గం మైలవరంలో నో ఎంట్రీ



- పెడన ప్రజలు ఆదరించినా భారీ అవినీతి
- తాజాగా పెనమలూరుకు షిఫ్ట్.. దోపిడీ షురూ
- కబ్జాలు, కొండలు, మట్టి, గ్రావెల్, బూడిద తవ్వకాలు
- అంతులేని అవినీతిలో రూ.కోట్ల ఆర్జన

కబ్జాల నుంచి గ్రావెల్ దోపిడీల వరకు.. అక్రమ తవ్వకాల నుంచి సారా తయారీ వరకు.. మట్టి నుంచి బూడిద వరకు.. అబ్బో ఆయన పాల్పడిన అవినీతికి అంతే లేదు. ప్రతి ఎన్నికల్లో సొంత నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టగానే మరో నియోజకవర్గాన్ని వెతుక్కునే ఆయన ఐదేళ్ల పాటు ఇష్టానుసారంగా ప్రవర్తించి సొంత పార్టీ నాయకుల్లోనే పర్సంటేజీల రాజాగా పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబు ఇంటిపై దాడితో మొదలై.. మంత్రిగా అన్ని నిర్వాకాలు పూర్తిచేసి.. చివరకు పెడన నుంచి పెనమలూరు షిఫ్ట్ అయ్యారు జోగి రమేశ్. తాజాగా కొత్త నియోజకవర్గంలో సరికొత్త మాయమాటలు చెబుతూ గెలుపు కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

జన కేతనంలో..

శత్రువులు మిత్రులవుతారు. మిత్రులు శత్రువులవుతారు. రాజకీయాల్లో ఇది సాధారణమే. ఇదే ఇప్పుడు వైసీపీ అభ్యర్థుల్లో వణుకు పుట్టిస్తోంది. ఎన్నికలకు కౌంట్‌డౌన్ మొదలైన నేపథ్యంలో వారిలో అభద్రతాభావం పెరుగుతోంది. కొన్నిచోట్ల వైసీపీలోని నాయకులే అభ్యర్థులకు సహకరించకూడదని నిర్ణయించుకున్నట్టు సమాచారం. మరికొన్నిచోట్ల ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నేతలు వెన్నుపోట్లు పొడిచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థులు జోరుగా, హుషారుగా కనిపిస్తున్నా అంతర్గత శత్రువులను ఎదుర్కోవడానికి నానా తంటాలు పడుతున్నారు.



వెన్నంటే ఉంటూ వెన్నుపోటు..!

వైసీపీ అభ్యర్థుల్లో అంతర్మథనం

- ఇతర పార్టీల నుంచి వచ్చినవారిపై అనుమానాలు
- సొంత పార్టీలోని అసమ్మతివాదులతోనూ భయం
- ప్రచారంలో జోరుగానే ఉన్నా లోలోపల అభద్రత
- రహస్య సమావేశాలు నిర్వహిస్తున్న అసమ్మతి నేతలు
- తెరవెనుక మంతనాలతో అభ్యర్థుల్లో పెరిగిన కలవరం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వైసీపీ అధిష్ఠానం మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును విజయవాడ సెంట్రల్ అభ్యర్థిగా బరిలోకి దింపింది. దీంతో ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మల్లాది విష్ణు అసంతృప్తితో ఉన్నారు. వెలంపల్లిని అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి విష్ణు పార్టీకి దూరంగా ఉంటున్నారు. గెలుపునకు సహకరిస్తానని విష్ణు చెబుతున్నప్పటికీ దీన్ని వెలంపల్లి వర్గం విశ్వసించడం లేదు. మల్లాది వర్గం తనకు సహకరిస్తుందా, లేదా అనే మీమాంసంలో వెలంపల్లి ఉన్నారు. ఇక్కడ వెలంపల్లి స్థానికుడు కాదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఇక ఎన్నికల ప్రచారంలో మల్లాది అప్పుడప్పుడే కనిపిస్తున్నారు. విష్ణు వర్గంలో ఉన్న కార్పొరేటర్లు వెలంపల్లి వెంట ప్రయాణిస్తున్నా అంతర్గతంగా మంతనాలు మాత్రం వేరుగా జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఈ భయంతోనే సెంట్రల్‌లో ఎక్కువగా పశ్చిమ నేతలు వెలంపల్లి వెంట ఉంటున్నారు.

- వైసీపీ అధిష్ఠానం విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మైనారిటీలకు అవకాశం ఇచ్చింది. ఇక్కడి నుంచి ఆసిఫ్ పోటీ చేస్తున్నారు. ఆసిఫ్ ఎదిగితే తనకు ప్రమాదమని వెలంపల్లి శ్రీనివాసరావు భావిస్తున్నారు. ఇటీవలే జనసేన నుంచి వైసీపీలో చేరిన పోతిన మహేశ్ కూడా ఇదే భావనలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగా పశ్చిమలో ఉన్న వైసీపీ నేతలు సెంట్రల్‌లో జరిగే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పోతిన మహేశ్ ఆసిఫ్‌కు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నట్టు వైసీపీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు శత్రువులుగా ఉన్న వెలంపల్లి, పోతిన ఇప్పుడు ఆసిఫ్ విషయంలో ఒకతాటిపై నడుస్తున్నట్టు సమాచారం. ఈ ఇద్దరు నేతలు రహస్య సమావేశాలు నిర్వహించుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇదిప్పుడు పశ్చిమ నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. పశ్చిమ నియోజకవర్గంలో బలంగా ఉన్న రెండు సామాజికవర్గాల నేతలకు ఇప్పటికే పలు సందేశాలు వెళ్లినట్టు సమాచారం.

చాలాచోట్ల ఇదే పరిస్థితి

మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్‌పై పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కూడా అభద్రత భావంలో ఉంటున్నారని చెబుతున్నారు. జడ్పీటీసీగా ఉన్న తిరుపతిరావును అభ్యర్థిగా ప్రకటించి వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. సీనియర్ నేతలు ఉన్నా తిరుపతిరావును ప్రకటించడంతో వారంతా అసంతృప్తి చెందుతున్నారు. దీంతో వైసీపీ అధిష్ఠానం ఒక వర్గాన్ని ఈ నియోజకవర్గంలో రంగంలోకి దింపింది. మైలవరంలో పార్టీలో తిరుగుతూ ప్రచారాల్లో పాల్గొంటున్న ఈ నేతలు ఎప్పటికప్పుడు వివరాలు అధిష్ఠానానికి పంపుతున్నారు. 'పంపిణీ' కార్యక్రమం మొత్తం ఈ వర్గం భుజాలపై వేసుకున్నట్టు సమాచారం. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోనూ అసమ్మతివర్గాలు తయారు కావడంతో ఎవరెవరు ఏవిధంగా వెన్నుపోట్లు పొడుస్తారోనని అభ్యర్థులకు చెమటలు పడుతున్నాయి.



నీట్ పరీక్ష ఆదివారం విజయవాడలో జరిగింది. పకడ్బందీ ఏర్పాట్ల నడుమ పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. విజయవాడలోని ఓ పరీక్షా కేంద్రంలో విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఫొటోలు తీసి లోపలకు పంపిస్తున్న సిబ్బంది.

అంబారుపేటలో రోడ్డు ప్రమాదం

ఇద్దరు మహిళలు దుర్మరణం

నందిగామ రూరల్, మే 5 : నందిగామ మండలం అంబారుపేట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతిచెందారు. నందిగామ సీఐ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం ద్వారకా తిరుమల నుంచి హైదరాబాద్‌కు ఆసుపత్రి పనిమీద కారులో వెళ్తున్న ఇద్దరు మహిళలు అంబారుపేట వద్ద సత్యమ్మను దర్శించుకోవాలనుకున్నారు. ఆలయానికి వెళ్లేందుకు కారు దిగి రోడ్డు దాటుతుండగా, హైదరాబాద్ వెళ్తున్న మరో కారు వీరిని ఢీకొట్టింది. ఇద్దరు మహిళలు చనిపోయారు. మృతుల్లో బొప్పన స్వరూపరాణి (60) రామవరప్పాడు కాగా, వేగి పద్మజ (50) ద్వారకా తిరుమలకు చెందినవారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

8న ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు



ఏర్పాట్లపై మాట్లాడుతున్న కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం, మే 5: ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 8వ తేదీ సాయంత్రం ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని విజయవాడ వెళతారని అక్కడ పర్యటన ముగించుకుని తిరిగి విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ వెళతారని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. గన్నవరం విమానాశ్రయంలో ప్రధాని పర్యటన ఏర్పాట్లపై ఆదివారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కాన్వాయ్, జిల్లా పరిధిలో ప్రధాని వెళ్లే రోడ్డు మార్గంలో చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. విమానాశ్రయంలో లైఫ్ సపోర్టు వైద్య సదుపాయంతో ఆధునిక అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు పిన్నమనేని ఆస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. విమానాశ్రయంలో వీఐపీ లాంజ్‌లో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జె.గీతాభాయి, డీటీసీ సురేందర్, సివిల్ సప్లయిస్ డీఎం తోట సతీష్, ఆర్అండ్‌బీ డీఈ బలరాం తదితరులు పాల్గొన్నారు.



నోబుల్ కళాశాల ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న కొల్లు రవీంద్ర

కొందరు ఓపీవోలు ఓటేయలేకపోయారు

- ఆర్వోలకు చేరని ఇతర జిల్లాల ఉద్యోగుల పేర్లు
- సమస్యను ఆర్వో వాణి దృష్టికి తీసుకెళ్లిన కొల్లు రవీంద్ర
- 7, 8 తేదీల్లో ఓటేసే అవకాశం కల్పిస్తామన్న ఆర్వో

మచిలీపట్నం టౌన్, మే 5: ఎన్నికల విధుల్లో ఓపీవోలుగా నియమితులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆదివారం నోబుల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పించారు. కానీ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో పనిచేస్తూ మచిలీపట్నంలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల పేర్లు పేర్లు రిటర్నింగ్ అధికారులకు వచ్చిన జాబితాల్లో లేకపోవడంతో కొందరు ఓపీవోలు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. సమస్యను రిటర్నింగ్ ఆఫీసర్, మచిలీపట్నం ఆర్డీవో వాణి దృష్టికి కూటమి మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర తీసుకెళ్లారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటేశాలా చూడాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్లపై సమస్యలు ఉన్నవారికి ఈనెల 7,8 తేదీల్లో ఆర్డీవో కార్యాలయంలో ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని వాణి తెలిపారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌కు కొందరు ఓపీవోలు ఓటు వేసేందుకు వచ్చారు. కానీ వారికి సోమవారం చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్టు అధికారులు తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్రలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసుకునేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని మద్దతు ఇవ్వాలని కోరారు. వైసీపీ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పడిన ఇబ్బందులను కొల్లు రవీంద్ర గుర్తు చేశారు.



ఎన్నికల అధికారులను నిలదీస్తున్న తంగిరాల సౌమ్య

అభ్యర్థిగా నా హక్కును మీరెలా కాలరాస్తారు

- బూత్‌లు సందర్శించకుండా అడ్డుకున్న ఎన్నికల అధికారులపై తంగిరాల సౌమ్య ఆగ్రహం
- అభ్యర్థి కాని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్‌ను క్యాంపస్‌లోకి ఎలా అనుమతించారని నిలదీత

నందిగామ, మే 5: ఆర్డర్ ఉంటే చూపించండి లేకుంటే మిన్నకుండి పోండి, అభ్యర్థిగా నాకున్న హక్కును మీరెలా కాలరాస్తారు అంటూ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి తంగిరాల సౌమ్య ఎన్నికల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సందర్భంగా బూత్‌లను సందర్శించిన సౌమ్యను ఎన్నికల అధికారులు అడ్డుకోవడంతో ఆమె అసహనానికి గురయ్యారు. అధికారులు వ్యవహరించిన తీరుపై తన సహజ నైజానికి భిన్నంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన ఈఘటనతో అధికారులు అవాక్కయ్యారు. పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన సౌమ్యతో మాట్లాడిన ఆర్వో రవీంద్రరావు బూత్‌లోకి ఎవరూ రాకూడదని అభ్యంతరం చెప్పారు. బూత్‌లోకే కాదు క్యాంపస్‌లో కూడా కొద్దిసేపు మాత్రమే ఉండాలని ఆర్వో అనడంతో తాను అభ్యర్థినని, తనకు పోలింగ్ బూత్‌లలో పర్యటించే హక్కు ఉందని సౌమ్య వాదించారు. అభ్యర్థి కాని ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌ను క్యాంపస్‌లోకి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. మీకు ఏదైనా ఆర్డర్ ఉంటే చూపించాలని లేని పక్షంలో తాను బయటకు వెళ్లే ప్రసక్తి లేదని ఆమె భీష్మించారు. దీంతో ఎన్నికల అధికారులు వెనక్కు తగ్గారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు చెల్లుబాటయ్యేలా చూడండి

- ఎన్నికల అధికారికి ఎస్టీయూ వినతి

గుడివాడ: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ విషయంలో కొందరు గెజిటెడ్ అధికారులు ఫారం 13ఏ పై సంతకాలు మాత్రమే చేసి హోదా స్టాంపును వేయలేదని, దీంతో ఓట్లు చెల్లుబాటు కావని, ఇలా చేసిన ఆ గెజిటెడ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఇమ్మానియేలు, డి.చంద్రశేఖర్‌లు ఆదివారం రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నికల డ్యూటీ ఆర్డర్, గుర్తింపు ధ్రువీకరణ పత్రాలను తీసుకుని ఓటేసేందుకు వెళ్లగా, ఫారం 13 ఏపై రిటర్నింగ్ అధికారి నియమించిన గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ సంతకాలు చేసి హోదా స్టాంపును వేయలేదన్నారు. అడిగితే స్టాంపు అవసరం లేదని సమాధానమిచ్చారన్నారు. రిటర్నింగ్ అధికారి, గెజిటెడ్ అధికారి చేసిన తప్పుకు తమ ఓటు మురిగిపోతుందన్నారు. అధికారులపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుని, తమ ఓట్లను చెల్లుబాటయ్యేలా చూడాలని వారు కోరారు.

వైసీపీ నాయకులపై క్రిమినల్ కేసు

- మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఎన్నికల ప్రచారంలో ట్రాక్టర్లతో రోడ్డపై చక్కర్లు.. భయబ్రాంతులకు గురైన ప్రజలు
- విధులకు ఆటంకం కల్గించి, పోలీసులపై దురుసు ప్రవర్తన

రెడ్డిగూడెం, మే 5: వైసీపీ మైలవరం అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఎన్నికల ప్రచారం సందర్భంగా శనివారం తాడిగూడెం ప్రధాన రహదారిలో ట్రాక్టర్లతో రోడపైకి వచ్చి చక్కర్లు కొడుతూ ప్రజలను భయబ్రాంతులకు గురి చేసిన రంగాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు బొల్లారెడ్డి చెన్నారెడ్డితో పాటు మరో 9 మంది యువకులపై క్రిమినల్ కేసు నమోదు చేశామని పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రశ్నించిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించారని, విధులకు ఆటంకం కలిగించారని, ఎన్నికల నిబంధనలను అతిక్రమించారని పోలీసులు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారందరినీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారందరిపై గట్టి నిఘా ఉంచుతామని, వారిపై పాటు రౌడీషీట్ ఓపెన్ చేశామని పేర్కొన్నారు. క్రాకర్లు కాల్చినా, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవని, క్రమ పద్ధతిలో ప్రచారం చేసుకోవాలని వారు సూచించారు.



గొల్లపూడిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేశినేని చిన్ని, వసంత కృష్ణప్రసాద్, బొమ్మసాని సుబ్బారావు, అక్కల గాంధీ



పాత రాజరాజేశ్వరిపేట మదీనా మస్జిద్ హమ్ జియాలో ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న కేశినేని చిన్ని

రాష్ట్రంలో సైకిల్ ప్రభంజనం ఖాయం

- గొల్లపూడి ఎన్నికల ప్రచారంలో కేశినేని చిన్ని
- మైలవరం అభివృద్ధికి తాను, వసంత కృషి చేస్తామని హామీ

గొల్లపూడి, మే 5: రాష్ట్రంలో తిరుగులేని ఓట్లు సాధించి టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్ ప్రభజనం సృష్టిస్తుందని భారీ విజయంతో దూసుకొస్తుందని, చంద్రబాబు సీఎం అవ్వడం ఖాయమని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. గొల్లపూడిలో ఆదివారం కూటమి మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. వసంతను ఎమ్మెల్యేగా, తనను ఎంపీగా రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. మైలవరం అభివృద్ధికి వసంత, తాను కృషి చేస్తామని చిన్ని హామీ ఇచ్చారు.

అల్లా ఆశీస్సులతో చంద్రబాబు సీఎం అవ్వాలి

పాత రాజరాజేశ్వరి పేట: అల్లా ఆశీస్సులతో ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలిచి, చంద్రబాబు మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కూటమి విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) కోరుకున్నారు. 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరిపేటలోని జెండా చెట్టు సెంటర్ వద్ద గల మదీనా మస్జిద్ హమ్ జియాలో ఆదివారం ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదు పెద్దలు ఎండీ రబ్బాని షరీఫ్, యూసఫ్ షరీఫ్, మస్తాన్, షేక్ షబ్బీర్‌లు స్వాగతం పలికారు. సుజనా చౌదరి కుమారుడు యలమంచిలి కౌషిక్ పాల్గొన్నారు.

ఒక్క బూత్‌లోనైనా నాపై మెజార్టీ తెచ్చుకో

కొడాలి నానికి వెనిగండ్ల రాము సవాల్ ● వైసీపీ నుంచి టీడీపీలో చేరిన దోకిపర్రు సర్పంచ్ జ్యోతి



దోకిపర్రు సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యురాలు రాజులపాటి దుర్గాభవానీని టీడీపీలో చేర్చుకుంటున్న వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు తదితరులు

గుడివాడ: "ఇకనైనా పిచ్చివాగుడు మానుకో. నియోజకవర్గంలోని ఒక్క బూత్‌లోనైనా నాపై మెజార్టీ తెచ్చుకుని మాట్లాడు. దోచుకున్న సొమ్మును ఎన్నికల్లో విచ్చలవిడిగా పంచుతున్న నీకు ఏం వ్యాపారం చేసి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నావో చెప్పే దమ్ముందా" అని వైసీపీ అభ్యర్థి కొడాలి నానికి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గుడివాడ నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము సవాల్ విసిరారు. ఆదివారం గుడ్లవల్లేరు మండలం దోకిపర్రు గ్రామ సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యురాలు రాజులపాటి దుర్గాభవాని తదితరులు వెనిగండ్ల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సం దర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నమ్మి అనేకమంది ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నారన్నారు. సొంత పార్టీ నాయకులే నాని వ్యవహారశైలి నచ్చక పార్టీని వీడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామ నాయకులు సుబ్బారెడ్డి, వెల్లంకి ఉమాశంకర్, వీరమాచినేని శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాలు తీసిన



ఇసుక తవ్వకం వల్ల మునేటిలో ఏర్పడిన గుంత, గుంతల్లో పడి చనిపోయిన యువకుల దేహాలను బయటకు తెస్తున్న ప్రజలు(ఫైల్)

ఇసుకాసురుల ధనదాహం!

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఐదేళ్లుగా అడ్డగోలు తవ్వకాలు

- నీటిలో కలిసిపోయిన పదుల సంఖ్యలో ప్రాణాలు



బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మునేటిలో ధర్నా చేస్తున్న మాజీ మంత్రులు దేవినేని ఉమా, నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య(ఫైల్)

కంచికచర్ల: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇసుకాసురుల ధనదాహానికి పలువురు బలయ్యారు. గడిచిన ఐదేళ్లలో అడ్డ గోలు తవ్వకాలతో పలువురిని పొట్టనబెట్టుకున్నారు. కృష్ణానదిని, మునేటిని యంత్రాలతో ఇష్టారాజ్యంగా మీటర్ల కొద్దీ ఎక్కువ లోతు తవ్వటం వల్ల పదుల సంఖ్యలో నిండు ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. ఇసుక గుంతల్లో పడి చేతికంది వచ్చిన కొడుకులు మృతిచెందటంతో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలు కకావికలమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాల వల్ల ప్రాణనష్టం జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టిం చుకోలేదు. వాల్టా చట్టం నిబంధనల ప్రకారం యంత్రాలతో ఇసుక తవ్వ కూడదు. తవ్వకాలకు కూలీలనే వినియోగించుకోవాలి. రాత్రిళ్లు తవ్వకూ డదు. కానీ, కాసుల కోసం ఇసుకాసురులు వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కారు. తమదే రాజ్యమన్నట్టుగా ఇష్టమొచ్చినట్టుగా తవ్వకాలు సాగిం చారు. వాల్టా చట్టం ప్రకారం నదిలో ఇసుక ఎనిమిది మీటర్ల మందం ఉంటే రెండు మీటర్ల వరకు తవ్వే వెలుసుబాటు ఉంది. కానీ, ఐదు మీటర్లకు మించి, కొన్ని ప్రాంతాల్లో ఇసుకపొర ఉన్నంత వరకు భారీ యంత్రాలతో తవ్వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇసుక రెండు నుంచి మూడు మీటర్ల మందం మాత్రమే ఉన్నప్పటికీ మొత్తం ఇసుక తవ్వేశారు. దీంతో గుంతలు ఏర్పడ్డాయి. నీటి ఊటతో గుంతలు నీటితో నిండిపోతున్నాయి. వరదలపుడు ఎగువ నుంచి ఇసుక వచ్చినప్పటికీ రెండు మూడేళ్ల వరకు పూడకపోవటంతో నీటి మడుగుల్లా తయారవుతున్నాయి. ఈత సరదా కోసమో, లేక మరో అవసరం కోసమో దిగిన వారిని గుంతలు మింగే స్తున్నాయి. గుంతల లోతు ఎక్కువగా ఉండటం వల్ల క్షణాల్లోనే విగత జీవులుగా మారుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఐదేళ్లలో పదుల సంఖ్యలో మృత్యువాతపడ్డారు. అయినప్పటికీ అధికారుల్లో స్పందన శూన్యం. ఇసుక తవ్వకాలు ఆపింది లేదు.

బలైపోయింది వీరే..

- 2022 జనవరి 10న చందర్లపాడు మండలం ఏటూరు వద్ద మునేటి గుంతల్లో పడి అభంశుభం తెలియని ఐదుగురు విద్యార్థులు మృతిచెందారు. సంక్రాంతికి పాఠశాలకు సెలవులు ఇవ్వటంతో సరదాగా గడిపేందుకు విద్యార్థులు మునేటి వద్దకు వెళ్లారు. ఐదుగురు పిల్లలు గుం తల్లో పడిపోయారు. వ్యవసాయ పనులకు వెళ్లిన నిరుపేద తల్లిదండ్రులు ఇంటికి వచ్చేంత వరకు తెలియదు. చీకటి పడినప్పటికీ పిల్లలు ఇళ్లకు రాకపోవటంతో గాలించటంతో ఈ సంఘటన బయటపడింది. తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు.
- 2023 నవంబరు 13న కంచికచర్ల మండలం కీసర మునేటిలో జరిగిన ప్రమాదంలో నందిగామ మండలం ఐతవరం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతిచెందారు. పది మంది యువకులు మునేటి వద్దకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో గుంతలో దిగిన ముగ్గురు నీటిలో పడి ఊపిరాడక క్షణాల్లోనే చనిపోయారు.
- అదే ఏడాది అంతకు ముందు ఏప్రిల్ 23న కంచికచర్ల మండలం గనిఆత్కూరు వద్ద కృష్ణానది గుంతల్లో పడి పరిటాలకు చెందిన ఇద్దరు యువకులు మృతిచెందారు.
- గత ఏడాది చందర్లపాడు మండలం చింతలపాడు వద్ద మునేటిలో పడి కంచికచర్ల మండలం మున్నలూరుకు చెందిన ఒక రైతు, కీసర వద్ద ఒక వీఆర్వో, చెవిటికల్లు వద్ద కృష్ణానదిలో ఒక పశువుల కాపరి మృతిచెందారు. ఇంకా వెలుగులోకి రానివి ఎన్నో.

మూడు రాజధానులంటూ జగన్ కల్లబొల్లి మాటలు

- కూటమిని గెలిపించి, అమరావతిని నిలబెట్టుకుందాం: సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం

మచిలీపట్నం టౌన్, మే 5: "సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులంటూ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పారు. అమరావతి రాజధాని కోసం 29 గ్రామాల్లో రైతులు 33వేల ఎకరాలు ఇచ్చారు. కానీ వారిని వైసీపీ ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బ తీసింది. రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతే." అని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. ఓ హోటల్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌రెడ్డి నిజస్వరూపం ప్రజలు తెలుసుకుంటున్నారన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, కొడాలి నాని, తలశిల రఘురామ్, నందిగం సురేష్‌లు జగన్‌ను రాజధానిపై తప్పుదోవ పట్టించారన్నారు. వైసీపీ నేతలు కృష్ణానదిలో ఇసుకను తవ్వి నాలుగు వందల కోట్లు సంపాదించారని, కేంద్ర పర్యావరణ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి వంద కోట్లు పెనాల్టీ వేసిందని తెలిపారు. జగన్ మోసాలను రాష్ట్రమంతా వివరిస్తున్నామన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి అమరావతి రాజధానిని నిలబెట్టాలన్నారు.



భోగిరెడ్డిపల్లి సర్పంచ్ గరికపాటి శ్రీరాములు, నెలకుర్రు గ్రామ నాయకులను వైసీపీ నుంచి జనసేనలో చేర్చుకుంటున్న వల్లభనేని బాలశౌరి, బండి రామకృష్ణ

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయనున్న ప్రజలు: బాలశౌరి

మచిలీపట్నం టౌన్, మే 5: ప్రజలను ముంచుదామనుకుని వైసీపీ నాయకులు అనుకున్నారని, వైసీపీ అప్రజాస్వామిక విధానాలతో విసిగిన ప్రజలు ఈ ఎన్నికల్లో ఆ పార్టీని బంగాళాఖాతంలో కలిపేస్తారని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో భోగిరెడ్డిపల్లి సర్పంచ్ గరికపాటి శ్రీరాములు, ఆయన అనుచరులు, నెలకుర్రు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆయన పార్టీలో చేర్చుకున్నారు. ఈ ఎన్నికలయ్యాక కృష్ణాజిల్లా వాసులకష్టాలు తీరుతున్నాయన్నారు. జనసేనలో చేరిన వారిలో గరికపాటి వీరభద్రుడు, కృష్ణాంజనేయులు, వీరాంజనేయులు, చిలంకుర్తి రాజారావు, రవీంద్రబాబు, వాకా జయరాంతో కలిపి 25 మంది ఉన్నారు. టీడీపీ నాయకుడు రొండి కృష్ణయాదవ్, జనసేన నాయకుడు కొట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



లంకపల్లిలో ప్రచారం చేస్తున్న బాలశౌరి, బుద్ధప్రసాద్

కూటమి అభ్యర్థుల భారీ ర్యాలీ

ఘంటసాల: టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ మండలంలో ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీకి విశేష స్పందన లభించింది. లంకపల్లి, దాలిపర్రు, చల్లపల్లి మండలం లక్ష్మీపురం, రామానగరం, పుచ్చగడ్డల మీదుగా దేవరకోటకు ర్యాలీ చేరింది. ప్రత్యేక వాహనంపై అభివాదం చేస్తూ వారివురూ గాజుగ్లాసు గుర్తుకు ఓటేయాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. బైక్‌లు, కార్లతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్ఆర్ఐలు గొర్రెపాటి రంగనాథ్ బాబు, మూల్పూరి వెంకట్రావు, దోవారి పార్వతి, నాయకులు వల్లభనేని బాలకోటేశ్వరరావు, తుమ్మల చౌదరిబాబు, పరిశె చలపతి, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భానుప్రకాష్, గుత్తికొండ కల్యాణ్, బండి పరాత్పరరావు, గుత్తికొండ వరప్రసాద్, దిరిశం వెంకట్రావు, కొమ్మారెడ్డి లీలాకృష్ణ, పల్లికొండ నాగేశ్వరరావు, మిక్కిలినేని మధు, వీరమాచినేని భవానీప్రసాద్, నలుకుర్తి సురేష్, గువ్వాబత్తిన నాగేశ్వరరావు, యార్లగడ్డ వీరభద్రరావు, బొందలపాటి నాగేశ్వరరావు, దోనేపూడి బుజ్జి, సిద్దినేని కుమార్ రాజా, కోలపల్లి కిరణ్, ఏనుగు పాండురంగారావు, ఎస్.ఈఎస్.రామాంజనేయులు, సిద్ధినేని తేజ పాల్గొన్నారు.

ఆడపడుచులా అక్కున చేర్చుకున్నారు

- ప్రచారానికి వచ్చిన తంగిరాల సౌమ్యకు పట్టువస్త్రాలు పెట్టి స్వాగతం పలికిన హనుమంతుపాలెంవాసులు



సౌమ్యకు పట్టు చీరె పెడుతున్న రాటకొండ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు

నందిగామ, మే 5: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నందిగామ అభ్యర్థి తంగిరాల సౌమ్యను హనుమంతుపాలెం గ్రామం ఆడపడుచులా ఆదరించింది. పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు పెట్టి ప్రేమను చాటుకుంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన సౌమ్యకు ఇంటి ఆడపడుచులా గ్రామం స్వాగతించింది. గ్రామస్థులు పలువురు తమ ఇళ్ల వద్దకు వచ్చిన సౌమ్యను ఇంటి ఆడపడుచులా గౌరవిస్తూ పట్టు చీరెలు పెట్టి సత్కరించారు. నాయకులు రాటకొండ చంద్రశేఖర్, రాటకొండ గిరి, రాటకొండ వెంకట్రావు, గాడిపర్తి భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేశ్ కుమారుడు, అనుచరుల ఆగడాలు

- బైక్‌పై టీడీపీ ఫొటోలు ఉన్నాయని పెదపులిపాక ఎస్సీ కాలనీలో దళితుడిపై దాడి
- అడ్డొచ్చిన దళితవాడకు చెందిన మరో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులపై దాడి



సుదర్శన్ తలపైన బలమైన గాయం

పెనమలూరు, మే 5: పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి జోగి రమేశ్ కుమారులు, అనుచరుల ఆగడాలకు అంతే లేకుండా పోతోంది. కులం పేరుతో దూషించి దాడులు చేయడం షరా మామూలైంది. ఆదివారం జోగి రమేశ్ పెద్ద కుమారుడు రాజీవ్ పెదపులిపాక ఎస్సీ కాలనీలోకి ప్రచార నిమిత్తం వచ్చారు. ఆ సమయంలో రోడ్డుమీద ఉన్న దళితుడు సుదర్శన్ బైక్‌పైన టీడీపీ ఫొటోలు, ఫ్లెక్సీలు చూసి వీడెవడురా మనతో అని రాజీవ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు రబ్బానీ, సుబానీ, బాషా, కిడ్డే సుబానీని రెచ్చగొట్టాడు. దీంతో రెచ్చిపోయిన ఆనలుగురు సుదర్శన్‌ను, అడ్డొచ్చిన దళితవాడకు చెందిన పులిపాక సురేష్, రాజు, సుస్మిత, కీర్తన, రాణిలపై దాడులు చేసి దారుణంగా కొట్టారు. సుదర్శన్ తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న సీఐ రామారావు గ్రామంలో తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

నేడు మచిలీపట్నంలో జగన్ ఎన్నికల ప్రచారం

మచిలీపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మచిలీపట్నం వల్లూరి రాజా సెంటరులో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బహిరంగ సభలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకుని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ సభ జరిగే పరిసర ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. పోలీస్ అధికారులకు బందోబస్తు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. పోలీస్ వాహనాలతో ట్రయల్‌రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే పేర్ని నాని, వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు నేతృత్వంలో జగన్ సభకు భారీగా జన సమీకరణ చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	144, 153, 164
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.40

బోడెపై అసత్య ప్రచారం దుర్మార్గం: టీడీపీ

కంకిపాడు, మే 5 : వైసీపీ సోషల్ మీడియాలో బోడె ప్రసాద్‌పై అసత్య ప్రచారం చేయడం దుర్మార్గమని కాపు సంక్షేమ సంఘం, టీడీపీ మండల కార్యదర్శి పులి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, బోడె ప్రసాద్ కాపులను దూషించారంటూ అసత్య ప్రచారానికి దిగారని మండిపడ్డారు. వైసీపీ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ పాల్గొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా మాట్లాడుతూ వైసీపీ నీచ రాజకీయాలను ప్రజలు తిప్పి కొట్టాలన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు పిచుక క్రాంతి, జక్కా రఘు, ముప్పా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధే కూటమి లక్ష్యం

కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 5 : అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సంపద సృష్టించి, సంక్షేమ పథకాలు అమలు చేసే సత్తాగల నాయకుడు చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం దంటగుంట్ల, సిరివాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనకు రైతులు ట్రాక్టర్ల ర్యాలీతో, గజమాలలతో ఘన స్వాగతం పలికారు. టీడీపీ కూటమి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని, పెద్దలు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి బాలవర్ధనరావును నోటికి వచ్చినట్లు మాట్లాడిన నాయకుడికి బుద్ధిచెప్పే బాధ్యత ప్రజలదేనన్నారు. ప్రచారంలో దంట గుంట్ల, కొయ్యూరు, బొమ్ములూరు సర్పంచ్‌లు యజ్ఞవరపు వెంకట రంగారావు, కొల్లి వెంకట సత్యనారాయణ, కాటూరి విజయభాస్కర్, నాయకులు పల్లె రవిబాబు, జి. సత్యనారాయణ, యజ్ఞవరపు శ్రీనివాసరావు, కృష్ణారావు, చలమల ఫణీంద్రబాబు, ముత్తిరెడ్డి శ్రీను, చలపతి రమేష్, పిల్లా వెంకటేశ్వరరావు, చలసాని శ్రీనివాస్, సింగవరపు చంద్రమౌళి, కాలి రమేష్, కామినేని హరిబాబు, నాని ప్రసాద్, ఎర్రుబోయిన కుమార స్వామి, మండల అప్పారావు, ఆత్కూరి కొండలరావు, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, వేగిరెడ్డి పాపారావు, జాస్తి భూపతిరావు, మాదాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి..

నియోజకవర్గ విధ్వంసకర పాలన నుంచి అభివృద్ధి పథంలో పయనించాలంటే టీడీపీ కూటమితోనే సాధ్యమని టీడీపీ గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. వీరవల్లిలో నిర్వహించిన ప్రచారంలో భాగంగా టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే యాదవ సామాజిక వర్గానికి గొర్రెల యూనిట్లు, గౌడ సామాజికవర్గానికి చేయూత నందించే విధంగా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ, గుండపనేని ఉమా వరప్రసాద్, మండాది రవీంద్ర, కలపాల రాజాబాబు, అమృతపల్లి సూర్యనా రాయణ, లంక అజయ్, లింగంనేని చిన్ని, జోజి ప్రతాప్, వేములపల్లి శ్రీనివాసరావు, రాయి మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

గన్నవరం : తెలుగుదేశం పార్టీ కూటమికి వచ్చే ఎన్నికల్లో 160 స్థానాలు వస్తాయని ఆ పార్టీ రాష్ట్ర



జక్కులనెక్కలంలో మాట్లాడుతున్న ముద్దరబోయిన

ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జక్కులనెక్కలంలో కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల్లో విధ్వంసకర పాలన కొనసాగిందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళాశక్తి పథకంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసేందుకు హామీ ఇవ్వటం జరిగిందన్నారు. కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ తుల్లిమిల్లి ఝాన్సీ, సర్నాల బాలాజీ, బెనర్జీ, కాట్రు అప్పారావు, కాట్రు శ్రీనివాస్, పి.శ్రీను, వీర్ల రాంబాబు, జనసేన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



దంటగుట్లలో యార్లగడ్డ వెంకట్రావును భారీ గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

టీడీపీతోనే కార్మికుల సంక్షేమం

కార్మికులకు చేతినిండా పని దొరకాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఎస్టీ కాలనీ, గౌడపేట, కొత్తపేటలో యార్లగడ్డ వెంకట్రావు, జనసేన వల్లభ నేని బాలశౌరిలను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆడుకుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలడుగు నాని, అరవపల్లి బోస్, మద్దినేని వెంకటేశ్వరరావు, చిమట శ్రీనివాసరావు, జాస్తి ఫణిశేఖర్, మోదుగుమూడి సత్యనారాయణ, మద్దినేని సాంబశివరావు, బుస్సే నాగ ప్రసాద్, జాస్తి లక్ష్మీ, కంప దుర్గ, సరితాదేవి పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న నటుడు సాయిధరమ్‌తేజ్

హనుమాన్‌జంక్షన్, మే 5 : ప్రముఖ సినీహీరో, పవన్‌కల్యాణ్ మేనల్లుడు సాయిధరమ్‌తేజ్ ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆయన విజయవాడ నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం వెళుతూ మార్గమధ్యలోని హనుమాన్ జంక్షన్‌లో ఆగారు. అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో జనసేన మండల అధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, చిరంజీవి అభిమాన సంఘం నాయకులు అడపా దేవులుబాబు, అంజిబాబు, వీర మహిళ జయరాణి, పలువురు టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న సాయిధరమ్‌తేజ్

పబ్లిక్ స్థలాల్లో వెలసిన వైసీపీ బ్యానర్లు

ఉయ్యూరు, మే 5 : ఉయ్యూరు మండలం చినఓగిరాలలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ స్థలాల్లో వైసీపీ బ్యానర్లు వెలిశాయి. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేశ్, మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్‌రావు, జగన్మోహన్‌రెడ్డి ఫొటోలతో పాటు చినఓగిరాలకు చెందిన వైసీపీ మహిళా నాయకురాలి ఫొటోలతో రెండు బ్యానర్లు చినఓగిరాల పుల్లేరు వంతెన సమీపాన, గ్రామంలో రోడ్డుపక్కన విద్యుత్ స్తంభాలకు కట్టారు. ఎన్నికల నిబంధనల మేర పబ్లిక్ స్థలాల్లో పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉంచడం నిషిద్ధమైనప్పటికి బ్యానర్లు కట్టడం పట్ల అధికారులు ఏవిధంగా స్పందిస్తారో అని గ్రామస్తులు వేచి చూస్తున్నారు.



చినఓగిరాలలో విద్యుత్ స్థంభాలకు కట్టిన వైసీపీ బ్యానర్లు

ఈవీఎంలపై అవగాహన

హనుమాన్‌జంక్షన్/ రూరల్ : యార్లగడ్డ వెంకట్రావు విజయాన్ని కాంక్షిస్తు ఆదివారం బాపులపాడు తారకరామనగర్‌లో టీడీపీ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు నాయకత్వంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరమాచనేని సత్య ప్రసాద్, గార్లపాటి రాజేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, వడ్లమూడి అంజనేయులు, పలగాని శ్రీనివాసరావును, దాసరి బెనర్జీ, యల మంచలి నాగమణి పాల్గొన్నారు. ● వేలేరులో టీడీపీ రాష్ట్ర రైతు విభాగం నాయకుడు వేములపల్లి శ్రీనివాసరావు, భూక్యా సమీర్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రజలకు ఈవీఎంలపై ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. డమ్మీ ఈవీఎంలతో పోలింగ్ బూత్‌లో మొదటి ఈవీఎం బందరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి బాలశౌరికి గాజుగ్లాసు గుర్తుపై, రెండవ ఈవీఎంలో గన్నవరం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు సైకిల్ గుర్తుపై బటన్ నొక్కాలని వివరిస్తూ సోదాహరణంగా ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అవిర్నేని భవానిశంకర్, బాణావతుల స్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

గన్నవరంలో 82.46శాతం పోస్టల్ బ్యాలెట్ నమోదు

గన్నవరం, మే 5 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఆదివారం రెండవ రోజు 602 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. మొత్తం 730 ఓటర్లకు 602 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సచివాలయం ఉద్యోగులు, అంగన్వాడీ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది, జలవనరల శాఖ ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోగా 82.46 శాతం నమోదైనట్లు తెలిపారు. ప్రశాంతంగా, పారదర్శంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు జరిగాయని తెలిపారు. తహసీల్దార్‌లు పవన్‌కుమార్, సుబ్బారావు, డీటీలు షఫీకుమార్, గోపాల్‌రెడ్డి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ 7, 8 తేదీల్లో కూడా వినియోగించుకోవచ్చు

ఉయ్యూరు, మే 5 : ఎన్నికల డ్యూటీలు పడిన పెనమలూరు నియోజకవర్గ ఉద్యోగులకు కల్పించిన పోస్టల్ బ్యాలెట్ వారికి కేటాయించిన తేదీల్లో ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి మరో అవకాశం ఇస్తున్నట్టు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డి రాజు ఆదివారం ఓ ప్రకట నలో తెలిపారు. ఈ నెల 4, 5వ తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేని పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేని వారు సోమవారం వినియోగించుకోవచ్చని, 6వ తేదీన కేటాయించిన వారు కూడా వినియోగించుకోలేక పోతే అందరికీ 7, 8 తేదీల్లో కూడా వినియోగించుకునేందుకు అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ జరగాలంటే కూటమి అధికారంలోకి రావాలి



కూటమి అభ్యర్థులను గెలిపించాలని సూరంపల్లిలో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గన్నవరం, మే 5 : ఎస్సీ వర్గీకరణ జరగాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మంద వేణుబాబు మాదిగ అన్నారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలను గెలిపించాలని కోరుతూ ఆదివారం సూరంపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ వర్గీకరణను మొదటి నుంచి జగన్ మోహన్‌రెడ్డి వ్యతిరేకిస్తూనే ఉన్నారని, మాదిగల ద్రోహి జగన్‌రెడ్డి అన్నారు. జగన్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ పని చేస్తున్నాయన్నారు. నాయకులు విజయ్, దొండపాటి శేఖర్, కొమరవల్లి ప్రసాద్, లాము వాసు, కొరిటిగడ్డ దేవదాసు, పులపాక బాబూరావు, వంగూరు మరియదాసు, పులపాక కుమార్, దేవరపల్లి కోటేశ్వరరావు, నందేటి చత్రపతి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల అభివృద్ధి

ఉయ్యూరు, మే 5 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టో, చంద్ర బాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల అభివృద్ధి, అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలుగు మహిళ అధికార ప్రతినిధి మాదవీలత, పార్టీ నాయకుడు దూసర అజయ్‌కుమార్ అన్నారు. కూటమి ప్రకటించిన మేనిఫెస్టోలో పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరిస్తూ ముదునూరు దూసరపాలెంలో ఆదివారం కూటమి అభ్యర్థులు బోడె ప్రసాద్, బాలశౌరి తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించి సైకిల్, ఫ్యాన్ గుర్తులకు ఓట్లు వేసి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలన్నారు. మాజీ సర్పంచ్ తుమ్మల రామకోటయ్య, పార్టీ నాయకులు పాలడుగు బాలాజీ, మత్తే మహేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జోగి.. రౌడీవేషాలు సాగనివ్వం

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్

పెనమలూరు, మే 5 : మైలవరంలో చెల్లని జోగి రమేశ్‌ను వైసీపీ అధిష్ఠానం పెడన పంపితే అక్కడా తన ఇసుక, మట్టి, భూకబ్జాలతో స్థానికులను భయభ్రాంతులను చేయడంతో పునరాలోచనలో పడ్డ వైసీపీ పెద్దలు పెనమలూరుకు పంపారని ఇక్కడ జోగి, అతని తనయుల రౌడీవేషాలు సాగన్విమని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. ఆదివారం యనమలకుదురు 17వ డివిజన్‌లో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరికల సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసీపీ అభ్యర్థి, అతని తనయుల పిచ్చి చేష్టలను గమనించి ఎక్కువ మంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు పునరాలోచనలో పడ్డారని, పెనమలూరు వచ్చిన నెల రోజులకే కోట్ల విలువైన ఇసుక దోపిడీకి తెగబడి మంత్రి జోగి అభాసు పాలయ్యాడని విమర్శించారు. తాను, టీడీపీ నేతలు, కార్యకర్తలు కృష్ణా నదిలోకి వెళ్లి అక్కడి ఇసుక దొంగతనాలను చూసి అక్కడి రికార్డులను, జోగి ఇసుక టిప్పర్లను బాహ్య ప్రపంచానికి పరిచయం చేశామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో అనిల్, నితీష్, పాయల వెంకట్రావు, గంట నాని, షేక్ మస్తాన్, గద్ద నవీన్, రోహిత్, సత్యనారాయణ, గణేష్, బాజీ, జగదీష్, తాతాజీ, తిరుమలేశ్వరరావు తదితరులు ఉన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్

యనమలకుదురులో..

యనమలకుదురు చిన వంతెన నుంచి కామయ్యతోపు వంతెన వరకు బోడె ప్రసాద్ పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. యనమలకుదురులో తాను వేసిన రోడ్లే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయని, వైసీపీ హయాంలో ఇసుమంత అభివృద్ధి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట ముప్పా రాజా,వెలగపూడి బాబూరావు, ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, తమ్ము అశోక్, బలగం కొండ, పండుల రజిని, ఇబ్రహీం, షకీలా, సంపర శేఖర్ పాల్గొన్నారు.

అంధకారంలో ఆంధ్రప్రదేశ్..

కంకిపాడు : వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అంధకార ఆంధ్రప్రదేశ్‌గా మారిందని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ అన్నారు. మండలంలోని ఉప్పలూరులో ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ, ఇప్పటికే రాష్ట్రం అంధకారంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, స్థానిక టీడీపీ నాయకులు పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, కొల్లి గాంధీ, అన్నే మురళి, బొర్రా వెంకట్, వణుకూరు విక్రం పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు మేలు

టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీ, మైనార్టీలకు మేలు జరుగుతుందని టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఎందువ రాంబాబు అన్నారు. పెనమలూరు మండలం గోసాలలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బీసీ డిక్లరేషన్ ద్వారా బీసీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని తెలియజేశారు. వైసీపీ ఎంత తప్పుడు ప్రచారం చేసినా మైనార్టీలు టీడీపీతోనే ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు మాబు సుబాని, సెంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వజనుల సంక్షేమమే కూటమి లక్ష్యం

ఉయ్యూరు : చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలలో ప్రతి రైతుకు ఏటా రూ. 20వేల ఆర్థికసాయం, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 సాయంతో పాటు మరిన్ని సంక్షేమ పథకాలతో సర్వజనుల సంక్షేమం సాధ్యమవుతుందని కూటమి పెనమలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బోడె ప్రసాద్ తనయుడు బోడె వెంకట్రామ్ అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు బోడె ప్రసాద్, బాలశౌరి విజయాన్ని కాంక్షిస్తూ కూటమి నాయకులతో కలసి ఆదివారం కలవపాముల ఎస్సీ కాలనీలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబ రావు, సూరపనేని ప్రసాద్, వెల్లంకి రాజా, కలపాల మల్లేశ్వరరావు, కొండా ప్రవీణ్, మురళి, పాగోలు రాజేశ్, రాము, బీజేపీ నాయకుడు పోతురాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలూరులో టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో బోడె వెంకట్రామ్, అన్నే ధనయ్య

చలువపందిరికి అడ్డుగా ఆటోలు!

- పందిరిలోనే చిత్తులాట
- మండే ఎండలో ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

ఉయ్యూరు, మే 5 : వేసవిలో ఎండలు మండుతున్న పరిస్థితులు, బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు బస్‌షెల్టర్ లేని నేపథ్యంలో నిలువనీడ కల్పించేందుకు ఉయ్యూరు నగర పంచాయతీ ఏర్పాటు చేసిన చలువపందిరికి ఆటోలు అడ్డుగా నిలపడం, పందిరిలో చిత్తులాట ఆడేవారు, పోకిరీలు తిష్టవేయడంతో ఎండలో నిలబడలేక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. విజయవాడ వైపు వెళ్లే వందాలది ప్రయాణికులతో అనునిత్యం రద్దీగా ఉండే బస్‌స్టాప్ వద్ద వేచి ఉండేందుకు బస్‌షెల్టర్ లేక ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ బస్సుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రతి ఏడాది వేసవిలో ప్రయాణికుల కోసం త్కాలికంగా చలువపందిరి, చలివేంద్రం నగరపంచాయతీ ఏర్పాటు చేస్తుంది. ఈ సంవత్సరం రూ.లక్షతో నగరపంచాయతీ సమకూర్చిన చలువ పందిరి, చలివేంద్రంలోకి వేళ్లేందుకు దారి లేకుండా ఆటోలు, ఇతర వాహనాలు అడ్డుగా నిలుపుతున్నారు. దీంతో చలువ పందిరిలోకి వెళ్లినిలుచునేందుకు దారిలేక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.



చలువపందిరికి అడ్డుగా నిలిపిన ఆటోలు



కొండాలమ్మ సేవలో ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్ ప్రహ్లాద్



గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఎన్నికల పరిశీలకుడు ప్రసాద్ ప్రహ్లాద్ అంకునూరు ఆదివారం దర్శించుకొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆయనకు శేషవస్త్రం కప్పి అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాలలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన వారితో ఎన్ఆర్ఐలు, టీడీపీ నేతలు



కృత్తివెన్ను మండలంలో రోడ్‌షోలో బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్



కపిలేశ్వరపురంలో రోడ్‌షోలో వర్ల కుమార్ రాజా



పోలుకొండలో ప్రచారం నిర్వహిస్తున్న వెనిగండ్ల రాము

కూటమి విజయంతోనే సర్వజనుల సంక్షేమం

ఘంటసాల, మే 5 : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు, జనసేన పార్టీ మచిలీపట్నం అభ్యర్థి వల్లభనేని బాలశౌరి ధీమా వ్యక్తం చేశారు. ఘంటసాలలోని విశ్వేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలశౌరి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మిక రంగం నిర్లక్ష్యానికి గురైందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రాక్షస పాలన అంతమొందించేందుకు సైనికుల్లా పని చేయాలన్నారు. వల్లభనేని బాలకోటేశ్వరరావు, సిద్ధినేని కుమార్ రాజా, యార్లగడ్డ శ్రీకాంత్, తాడికొండ సాయి తేజ, ఎన్ఆర్ఐలు రంగనాథ్‌బాబు, మూల్పూరి వెంకట్రావు, టీడీపీ నేతలు తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, దిరిశం వెంకట్రావు, దిరిశం బాలకోటయ్య, పరిశె చలపతిరావు, గుత్తికొండ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

శ్రీకాకుళం పీఏసీఎస్ డైరెక్టర్, వైసీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ శ్రీనివాస చక్రవర్తి, కొత్తపల్లి పీఏసీఎస్ డైరెక్టర్, కొత్తపల్లి గ్రామ వైసీపీ కన్వీనర్ తలశిల సుధాకర్, వైసీపీ నేత తుమ్మల కృష్ణమోహన్, చిట్టూర్పు జోడుగూడెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కొడాలి గోపిలు ఆదివారం రాత్రి టీడీపీలోకి చేరారు. ఎన్ఆర్ఐ రంగనాథ్‌బాబు, మూల్పూరి వెంకట్రావు ఆహ్వానించారు.



జనసేనలో చేరిక

మామిడితోట గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యులు, వైసీపీ సీనియర్ నాయకులు లోయ నాగ శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లోయ వెంకటేశ్వరరావు, లోయ చిన్న సుబ్బారావు, లోయ వెంకట స్వామి, లోయ శివప్రసాద్, లోయ సాంబశివరావు కూడా జనసేనలో చేరారు. జనసేన పార్టీలోకి చేరిన వారిని మండలి బుద్ధప్రసాద్, బాలశౌరి అభినందించారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన జిల్లా పంచాయతీరాజ్ వైఎస్సార్ విభాగం సెక్రటరీ తోట కృష్ణాంజనేయులు, మామిడిబత్తుల వీరాస్వామి, తోట శ్రీహర్ష, మామిడిబత్తుల శివకృష్ణ, అప్పికట్ల శ్రీను, నూరుబోయిన శ్రీనుబాబు, లంకా రాజేష్, అనుమకొండ రామకృష్ణ, గంగాధర్, ఆకుల వెంకటేష్ జనసేన పార్టీలో చేరారు.



బాలశౌరి సమక్షంలో జనసేనలో చేరుతున్న మహిళలు



పామర్రులో ప్రచారం చేస్తున్న వర్ల కుమార్‌రాజా



భావదేవరపల్లిలో మండలి సతీమణి విజయలక్ష్మి ప్రచారం

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

మచిలీపట్నం టౌన్ : ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. జరీ ఆస్తాన్‌లో ఆదివారం ముస్లిం మైనారిటీ వర్గాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చాక రంజాన్ తోఫాలు రద్దయ్యాయన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర



జరీ ఆస్థానాలో బాలశౌరి, కొల్లు రవీంద్ర, వేదవ్యాస్

ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ, మచిలీపట్నంలో హిందూ ముస్లింల ఐక్యతకు వైసీపీ ప్రభుత్వం చిచ్చుపెట్టేందుకు ప్రయత్నం చేసి విఫలమైందన్నారు. బండి రామకృష్ణ, ఇలియాస్ పాషా, ఖాజా, బాజానీ, అమీర్, అనీమ్, మాదివాడ రాము పాల్గొన్నారు.

ఈడేపల్లిలో ప్రచారం

ఈడేపల్లిలో ఆదివారం పి.వి. ఫణికుమార్, గంజాల రవి కుమార్, కొల్లేరు సత్యనారాయణ, బత్తిన అగస్త్యేశ్వరరావు, కె.నాగేశ్వరరావు, జి. కృష్ణమూర్తి తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరామ 27వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పోసినవారిపాలెంలో జనసేనలో చేరిక

మచిలీపట్నం టౌన్ : పోసినవారిపాలెం, గంజాలవారి పాలెం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు, మహిళలు జనసేన పార్టీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, జనసేన నాయకుడు చిలంకుర్తి పృథ్వీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

బాలశౌరి, కాగిత భారీ రోడ్‌షో

కృత్తివెన్ను : మండల పరిధిలోని గరిశపూడి గ్రామం నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీ దోమలగొంది, నిడమర్రు, ఒర్లగొందితిప్ప, పోడు గ్రామాల మీదుగా పడతడిక, చినగొల్లపాలెం, పల్లెపాలెం, లక్ష్మీపురం, మాట్లం గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి కాగిత కృష్ణప్రసాద్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. భారీ ర్యాలీ ఆకట్టుకుంది. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. **పెడన :** పెడన నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష గూడూరులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. బాలశౌరి కుమారుడు అరుణ్‌శౌరి, కూటమి నాయకులు పోతన స్వామి, దాసరి ఉమా సాయిరామ్, గోపీ నాగబాబు, అన్నం హరి, తలుపుల కృష్ణ, ఎస్‌ఏ బేగ్, మునీశ్వరరావు, సిరివెళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నందివాడలో వెనిగండ్ల రోడ్ షో

నందివాడ : మండలంలోని ఏటి.నగర్, తమిరిశ, దండిగానపూడి, అనమనపూడి, పోలుకొండ, ఇలపర్రు, లక్ష్మీనరసింహాపురం, రుద్రపాక, గాజులపాడు తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి, ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు మాగంటి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, బొర్రా సత్యనారాయణ, బచ్చుల బోసుబాబు, మండల టీడీపీ నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడివాడలో వెనిగండ్ల సతీమణి సుఖదా..

గుడివాడ : గుడివాడ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము సతీమణి సుఖదా అన్నారు. ఆదివారం గుడివాడలోని 10, 11 వార్డుల్లో ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సయ్యద్ జబీన్, షేక్ ముజాహిద్, షేక్ సర్కార్, షేక్ జానీ షరీఫ్, కోడూరు డేవిడ్‌రాజు, దేవరపల్లి వినయ్ బాబు పాల్గొన్నారు.

కుమార్ రాజా రోడ్‌షో

పామర్రు : కుమార్‌రాజా ఆదివారం నిభానుపూడి, నిమ్మకూరు, కంచర్లవానిపురం, పామర్రులోని యలమర్రు రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రొండి కృష్ణ యాదవ్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, ఈడే నాని, పరసా సుబ్రహ్మణ్యం, మంతెన రామాంజనేయులు, కేదరాశిపల్లి శ్రీనివాసరావు, దాలిపర్తి ప్రసాద్, సిద్దంశెట్టి ఆంజనేయులు, దాసరి కొండ పాల్గొన్నారు. **పమిడిముక్కల :** కపిలేశ్వ



రపురం, గడ్డిపాడు, ముళ్లపూడి, వేల్పూరు గ్రామాల్లో పామర్రు టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్ శ్రీనివాసరావు, కార్యదర్శి బాబ్జి, జక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త తాతినేని రమేష్ ప్రచారం కోసం వచ్చిన కుమార్‌రాజాకు ఘనస్వాగతం పలికి తాను కూడా ప్రచారంలో పాల్గొన్నారు. **తోట్లవల్లూరు :** వల్లూరుపాలెంలో కుమార్ రాజా సతీమణి విశ్రమ, సోదరుడు చాణక్య, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, చింతపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చెన్నుపాటి పూర్ణచంద్రరావు, స్వరూపరాణి ఎన్నికల ప్రచారం చేశారు.

కూటమి నేతల ప్రచారం

అవనిగడ్డ : మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ అవనిగడ్డలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏడో వార్డులో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మాదివాడ లక్ష్మీ తులసిదేవి, రాయపూడి వేణుగోపాలరావు, లంకే యుగంధర్, గుడివాక శివరావు, అన్నపరెడ్డి వెంకటస్వామి, అన్నపరెడ్డి రామదాసు, గౌస్ కాటమ, దుడ్డు మురళీ, బచ్చు శ్రీహరి, యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, షేక్ లైలా, అడపా వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి లక్ష్మణ, అడపా శ్రీనివాసరావు, కన్నయ్య, లుక్కా శ్రీనివాస్, లుక్కా పిచ్చియ్య, పద్మయి, బండే కనకదుర్గ, యాసం లంకమబ్బ, విశ్వనాథపల్లి పాప తదితరులు పాల్గొన్నారు. **ఘంటసాల :** మండలి బుద్ధప్రసాద్ కుమార్తె కృష్ణప్రభ ఆదివారం మల్లాయిచిట్టూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు తుమ్మల వరలక్ష్మి, సర్పంచ్ ఆవుల రేవతి, కూటమి నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, ఆవుల ధర్మవెంకట నరసయ్య, వల్లభనేని బాలకోటేశ్వరరావు, గుత్తికొండ కళ్యాణ్, బండి రవితేజ, లోయ నాగ శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వరరావు, గుత్తి బాబూజీ, నాగరాజు, కొమ్ము సుందరరావు, అంబటి వెంకటేశ్వరరావు, కుంపటి ఉదయ్, ఉపసర్పంచ్ చింతల నాగ బాబు, వార్డుసభ్యులు,



అభిమానులు పాల్గొన్నారు. **కోడూరు :** మండలి బుద్ధప్రసాద్ కుమార్తె అవనిజ ఆదివారం స్వతంత్రపురం, ముందడుగు ఇంటింటికి ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. **మోపిదేవి :** పెదప్రోలులో సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు, ఎంపీటీసీ శ్రావణి, జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లిఖార్జునరావు, కూటమి నాయకులు ఎడ్ల శ్రీను, కేశాని సురేష్, బాసు శ్రీనివాసరావు, మద్దిపట్ల జగన్మోహనరావు, నాదెండ్ల వెంకట్రామయ్య, నాదెండ్ల రాజేష్, రామ్మోహనరావు, శ్రీను తదితరులు ప్రచారం చేశారు. **నాగాయలంక :** భావదేవరపల్లిలో బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మెండు లక్ష్మణరావు, మండలి ఉదయభాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, హరి, రేమాల మురళీ, మాదివాడ అర్జునరావు, రేమాల బాబురావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, మెండు సాయిరాం, శ్యామ్ ప్రసాద్, రేపల్లె జ్యోతిబసు, పేటేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **చల్లపల్లి :** మండలి బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్వినీకుమార్ ఆదివారం చల్లపల్లి, పాగోలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. జనసేన అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, మండలి బుద్ధప్రసాద్ ఆదివారం రాత్రి రోడ్ షో చేశారు. దాలిపర్రు నుంచి ఘంటసాల వెళుతూ లక్ష్మీపురం, సాలిపేట, రామానగరం, పుచ్చగడ్డ గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు.

నాగాయలంక : గణపేశ్వరంలో దుర్గా గణపేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోతుకూచి సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ చేసి స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త మండల రాంబాబు విశేష పూజలు జరిపారు. ఈవో సిహెచ్.సుధాకరరావు, సిబ్బంది పర్యవేక్షించారు. మర్రిపాలెంలో గంగానమ్మ వార్షిక జాతర జరిగింది. ధర్మకర్త మద్ది నాగేశ్వరరావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

మండవ వారి గంగమ్మ జాతర

నాగాయలంక : నాగాయలంకలో మండవ వారి ఇలవేల్పు గంగమ్మ వార్షిక జాతర ఆదివారం ఘనంగా జరిగి ముగిసింది. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అన్నదానం జరిగింది. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, మండవ బాబురావు, మండవ మధుసూదనరావు (బుజ్జి) తదితరులు పర్యవేక్షించారు.

గాజుల శంకరరావుకు మండలి పరామర్శ

అవనిగడ్డ రూరల్ : ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావును ఎన్డీయే కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వేకనూరులోని స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. త్వరలో పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరారు. జనసేన నియోజకవర్గ పరిశీలకులు మండలి రాజేష్, గుడివాక శేషుబాబు, గుడివాక శివరావు, తుంగల రాజా, తుంగల వేణు, మాదివా రత్నారావు, జనసైనికులు పాల్గొన్నారు.

పవన్ సభ విజయవంతం : జనసేన

గుడివాడ : గుడివాడలో శనివారం జరిగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ రోడ్‌షో, బహిరంగ సభకు వచ్చి ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయడం పట్ల టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. విశేష స్పందన చూసి వైసీపీకి వెన్నులో వణుకు ప్రారంభమైందన్నారు.

ఓటరు స్లిప్పులు అందరికీ అందాలి

పామర్రు : ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు అందించే ప్రక్రియను తక్షణమే పూర్తి చేసే బాధ్యత బూత్‌లెవెల్ అధికారులదేనని పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి అన్నారు. ఆదివారం పామర్రులో ఓటరు స్లిప్పుల విధానాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఎన్నికల డీటీ జగన్మోహనరావు, గోపాలరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి చండీహోమం

తోట్లవల్లూరు : యాకమూరులో బోలెం వారి ఇలవేల్పు అంకమ్మతల్లి నెల సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయంలో భక్తులు అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విక్కుర్తి చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం



పైప్‌లైన్‌కు సొంతఖర్చుతో మరమ్మతులు చేయించి తాగునీరు వదులుతున్న విక్కుర్తి

నాగాయలంక : దీనదయాళ్‌పురం గ్రామస్థులు మూడేళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు విక్కుర్తి శ్రీనివాస్ పరిష్కారం చూపించారు. పైపులైన్ పూర్తిగా దెబ్బతిని మోటార్లు చెడిపోయి ఉండటంతో మూడేళ్లుగా దీనదయాళ్‌పురం గ్రామస్థులు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. గ్రామస్థులుఅధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసిన ఉపయోగం లేకుండాపోయింది. విక్కుర్తి శ్రీనివాస్‌కు గ్రామస్థులు తమ సమస్య తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన శ్రీనివాస్ విక్కుర్తి వీరరాఘవయ్య ట్రస్ట్ ద్వారా పైపులైన్లు, మోటార్లు బాగు చేయించి ఆదివారం లాంఛనంగా తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. మూడేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కా రానికి కృషి చేసిన విక్కుర్తి శ్రీనివాస్‌కు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.

బుద్ధప్రసాద్‌కు తెలుగు రచయితల సంఘం అభినందనలు



అవనిగడ్డ : తెలుగు భాషా, సంస్కృతులకు ప్రాణ ప్రతిష్ఠ చేస్తామని జనసేనాని పవన్ కల్యాణ్ ప్రకటన చేయడం పట్ల ప్రపంచ తెలుగు రచయితల సంఘం హర్షం వ్యక్తం చేసింది. తెలుగు భాషకు తాను అంకితమని ప్రకటించిన మండలి బుద్ధప్రసాద్‌ను అవనిగడ్డలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొంబ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి.పూర్ణచంద్ కలిసి అభినం దనలు తెలిపారు. జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్న తెలుగు భాషాభిమానిని నియోజకవర్గ ప్రజలు గెలిపించాలని కోరారు.

పిఠాపురంలో పవన్ కల్యాణ్‌కు భారీ మెజారిటీ తథ్యం



ప్రచార కర పత్రాలు ఆవిష్కరిస్తున్న బుల్లెట్ ధర్మారావు

మచిలీపట్నం టౌన్ : పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని రాధా-రంగా మిత్ర మండలి అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు బుల్లెట్ ధర్మారావు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పిఠాపురంలో నాలుగు రోజులు పర్యటించి వచ్చామని, అడుగడుగునా జనసేన పార్టీకి పిఠాపురం ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. పవన్‌కల్యాణ్ పోటీచేయడం అదృష్టమని ఆ ప్రాంత ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్రల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. రాధా రంగా మిత్ర మండలి జిల్లా అధ్యక్షురాలు, టీడీపీ తెలుగుమహిళ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షురాలు లంకిశెట్టి నీరజ, రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షురాలు బడుగు ఉమాదేవి, విన్నకోట సుబ్బారావు, నిడదవోలు శ్రీనివాసరావు, ఉమ్మడిశెట్టి రాము పాల్గొన్నారు.

దళిత ద్రోహి జగన్

పెడన : ఓట్లు వేసి గెలిపించిన దళితులను జగన్ ప్రభుత్వం నట్టేట ముంచిందని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు దుయ్యబట్టారు. వీరభద్రపురంలోని కర్ణోద్భవ కల్యాణ మండపంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులకు ఏ ప్రభుత్వంలోనూ జరగనంత అన్యాయం వైసీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. 27 దళిత సంక్షేమ పథకాలను జగన్ నిర్దాక్షిణ్యంగా రద్దు చేశాడని మండిపడ్డారు. టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గోపీ నాగబాబు మాట్లాడుతూ, దళితులపై అమానుషమైన దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నా పట్టించుకోని జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతాడని హెచ్చరించారు.

ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులను సన్మానిస్తున్న ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

చల్లపల్లి, మే 5 : చల్లపల్లి ఎస్సార్‌వైఎస్పీహైస్కూల్ 1991-92 బ్యాచ్ 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం సందడిగా జరిగింది. ఆరు సెక్షన్‌లలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి 300 మంది పాల్గొన్నారు. 32 సంవత్సరాల తర్వాత కలు సుకున్న బాల్యమిత్రులు అందరూ ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి సంగతులు నెమరు వేసుకున్నారు. ఆత్మీయ కలయిక ఆహ్లాదకరంగా, సంతోషంగా జరిగింది. కళాశాల వ్యవస్థాపకులు శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహద్దూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అసువులు బాసిన గురువులకు, మిత్రులకు అంజలి ఘటిస్తూ సంతాపం తెలిపారు. విద్యను బోధించిన గురువులు ప్రభాకరరావు, సీతారామస్వామి, జవహర్, రాయపాటి ప్రసాద్, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, నగరాజకుమారిలను ఘనంగా సత్కరించుకున్నారు. పూర్వవిద్యార్థుల పరిచయ కార్యక్రమం జరుగ్గా, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయిలు రాజులపాటి శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, పూర్వవిద్యార్థులు పులి గంగా సుధాకర్, ఇట్ల ప్రసాద్, భృగుమళ్ల సాయిరాం, సుధా, బోలెం నాంచారయ్య, ఆకుల సుధీర్ కుమార్, కొడాలి మురళి తదితరులు పర్యవేక్షించారు.



ఎస్సార్‌వైఎస్పీ హైస్కూల్ 1991-92 బ్యాచ్ విద్యార్థులు





జన కేతనం

- నియోజకవర్గంలో ఇదే తొలి లక్ష్యం
- కూటమి అధికారంలోకొచ్చిన తొలి ఏడాదే ఎదురుమొండి వారధి పనులు ప్రారంభిస్తాం
- ఎడ్లంక దివికి వంతెన నిర్మిస్తాం
- పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తాం
- అవనిగడ్డలో కూటమి విజయం పక్కా
- ఆంధ్రజ్యోతితో మండలి బుద్ధప్రసాద్

ప్రతి ఎకరాకు సాగునీరు ప్రతి ఒక్కరికీ తాగునీరు

'మా నియోజకవర్గం వ్యవసాయక ప్రాంతం. ఇక్కడ ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించడమే నా తొలి లక్ష్యం. దీంతోపాటు ఎదురుమొండి వారధి నిర్మాణం, పర్యాటకాభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి కల్పించడం ముఖ్యం' అని అవనిగడ్డ బీజేపీ, టీడీపీ బలపరిచిన జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. బుద్ధప్రసాద్‌తో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ విశేషాలు..

– అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మీ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

ఏ గ్రామం వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మద్దతునిస్తున్నారు. నేను, నా సతీమణి, కుమారుడు, కోడలు, ఇద్దరు కుమార్తెలు, అల్లుళ్లు, మనుమరాలు అంతా ప్రచారంలో పాల్గొంటున్నాం. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నా ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ప్రజలు ఇంత మమేకం కావటం ఎప్పుడు చూడలేదు.

నియోజకవర్గానికి మీరేచ్చే హామీలు ఏమిటి?

తీర ప్రాంత గ్రామాలకు వెళ్లే రహదారులన్నీ ధ్వంసమయ్యాయి. పర్యాటక అభివృద్ధి పూర్తిగా కుంటు పడిపోయింది. సాగు, తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా కల్చర్ కుదేలైంది. ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఒక్కరికీ తాగునీరు అందించటమే లక్ష్యంగా పని చేస్తా. అవుట్ ఫాల్ స్లూయిస్ పునర్నిర్మాణం, శిథిలమైన సముద్రపు కట్ట, ఏటి కరకట్టల నిర్మాణం, పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణ, శయన బుద్ధ ప్రాజెక్టు పూర్తి చేయటం, అవనిగడ్డలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుని ఈ ఎన్నికల బరిలో దిగాను.

మీ రాజకీయ ప్రత్యర్థి బలాలు? బలహీనతలు ఏమిటి? వాటిని ఎలా అధిగమిస్తారు?

ఇక్కడ బల బలాలు ప్రసక్తి అవసరం లేదు. నేను పైరవీలకు దూరం. కక్షలు, కార్పణ్యాలతో నిత్యం అశాంతితో కొట్టుమిట్టాడే నియోజకవర్గంలో శాంతిస్థాపన కోసం నేను ఎంతగానో కృషి చేశాను. ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రజల నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయారు. నాబార్డు చైర్మన్ లాంటి వ్యక్తి వస్తే ఆయన ప్రదర్శించిన తీరు దేశం మొత్తం చూసింది.

తీర ప్రాంత అభివృద్ధికి మీరిచ్చే హామీ ఏమిటి?

ఎదురుమొండి వాసులకు దశాబ్దాల కాలంగా తమను బాహ్య ప్రపంచాన్ని కలుపుతూ ఓ వారధి నిర్మించాలని కోరుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నిధులు పక్కదారి పట్టించారు. నిధులను నుంచి కొంత మొత్తాన్ని పక్కదారి పట్టించారు. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఏడాదిలోనే ఎదురుమొండి వారధి నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. ఎడ్లంక దివికి వంతెన నిర్మిస్తాం. దివి ప్రాంతానికి ఉప్పెన ముప్పుల నుంచి రక్షణ ఇచ్చే సముద్రపు కరకట్ట, వరదల నుంచి రక్షణ కల్పించే ఏటి కరకట్టలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

యువతకు ఉపాధి కల్పన కోసం మీరు ఎలాంటి చర్యలు చేపట్టబోతున్నారు?

ఇక్కడ ఉన్న ఏకైక పరిశ్రమ లక్ష్మీపురం కేసీపీ ఫ్యాక్టరీ మాత్రమే. అది కూడా నేడు ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేసింది. ప్రస్తుతం యువతకు స్థానికంగా వ్యవసాయ పనులు తప్ప ఇతర ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలు లేకుండాపోయాయి. ఆధ్యాత్మిక పర్యాటకంలో భాగంగా శ్రీకాకుళం, మొవ్వ, ఘంటసాల, మోపిదేవి, పెదకళ్లేపల్లి, హంసలదీవి, గణపేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. తద్వారా వందలాది మందికి ప్రత్యక్షంగానూ, కొన్ని వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

మీ ప్రత్యర్థి సింహాద్రి రమేష్‌బాబు అభివృద్ధి అంతా తన హయాంలోనే జరిగిందని అంటున్నారు. దీనిపై మీ స్పందన ఏమిటి?

మనం చేసే పని ద్వారా పది కాలాల పాటు 10 మంది ఆ ఫలాలను ఆస్వాదించటమే నిజమైన అభివృద్ధి. ఇలాంటి ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా ఎమ్మెల్యే రమేష్‌బాబు చేయలేదు. కనీసం అవనిగడ్డ నియోజకవర్గంలో మేం మొదలుపెట్టిన జలక్రీడల కేంద్రాన్ని, శయన బుద్ధ ప్రాజెక్టును ఆధ్యాత్మిక పర్యాటక ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లి ఉంటే ఎంతో మంది దేశం మెచ్చదగ్గ జలక్రీడాకారులుగా తయారై ఉండి ఉండేవారు. ఎదురుమొండి వారధి నిర్మించిన తర్వాతే ఓట్లు అడుగుతానని చెప్పిన పెద్ద మనిషి నేడు అక్కడికి వెళ్లి ఓట్లు ఎలా అడుగుతారు.



ఏడాదికి 10వేల ఉద్యోగాలు

గెలిచాక యువతకు ఐదేళ్లలో 50 వేల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- తాగు, సాగు నీటి సమస్యలను పరిష్కరిస్తా
- మూసివేసిన పాఠశాలలను తెరిపిస్తా
- ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా
- గడ్డం గ్యాంగ్‌ను తరిమికొడతా
- జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము

గుడివాడలో పుట్టి పెరిగిన వెనిగండ్ల రాము అంటే కేవలం ఎన్ఆర్ఐగానే పరిచయం. రెండేళ్ల క్రితం వరకు ఈ పేరు ఎవరికీ తెలియదు. రెండేళ్ల నుంచి సేవా కార్యక్రమాలతో ప్రజల నోళ్లలో నానుతూ నాయకుడిగా ఎదిగారు. టీడీపీ నేతగా ప్రజా సమస్యలపై ఆందోళనలు చేపట్టారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా చేసిన నానికి చెమటలు పట్టిస్తున్నారు. గుడివాడ నానిపై గెలిచి నియోజకవర్గంలో యువతకు ఏడాదికి 10 వేల చొప్పున ఐదేళ్లలో 50వేల ఉద్యోగాలు వచ్చేలా చేస్తానని చెబుతున్న వెనిగండ్ల రాముతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ విశేషాలు..

- గుడివాడ, ఆంధ్రజ్యోతి

ప్రచారం ప్రజలు ఎలా స్పందిస్తున్నారు?

120 రోజులుగా ప్రతిరోజు ప్రజల మధ్యలోనే ఉన్నాను. 68,500 ఇళ్లకు స్వయంగా వెళ్లా. మళ్లీ మరోమారు ప్రజల్లోకి వెళుతూ వారి సమస్యల పరిష్కారానికి నేను కట్టుబడి ఉన్నానని హామీ ఇస్తున్నాను. ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామిలేంటి?

ముందుగా ఏడాదికి 10 వేల మం చొప్పున ఐదేళ్లలో 50 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. గుడివాడ పట్టణంలో తాగునీరు దొరకడం లేదు. పంపుల చెరువు కట్ట కొట్టుకుపోతే రెండేళ్లుగా మరమ్మతుల్లేవు. అధికారంలోకి రాగానే కట్టకు మరమ్మతుల చేపట్టి వినియోగంలోకి తీసుకుస్తాం. గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు పడకేశాయి. వీధి లైట్లు లేవు. డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. అంతర్గత రహదారులు దయనీయం. పోలవరం పూర్త చేసి కృష్ణాడెల్టాకు రెండు పంటలకు నీరందించేలా కృషి చేస్తా. టిడ్కో లబ్ధిదారుల ప్రధాన సమస్య అయిన రుణమాఫీని చేయించి మౌళిక వసతులను పూర్తిస్థాయిలో కల్పిస్తా.

ఐదేళ్ల వైసీపీ పాలనపై ప్రజలేమంటున్నారు?

అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి అంటే గిట్టని, తెలియని వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవడంతో అభివృద్ధి కుంటుపడింది. మంత్రిగా మూడేళ్ళు చేసినా ఐదేళ కాలంలో ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదు. గడ్డం గ్యాంగ్ పేరుతో ప్రజల్లో నాని అనుచరులు చేసిన అరాచకాలకు అంతే లేదు. ఇసుక, మట్టి, క్యాసినో, పేకాట, క్రికెట్ బెట్టింగ్, గంజాయి అమ్మకాల ద్వారా కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారు. అధికారమదంతో 1600 మంది టిడ్కో లబ్ధిదారులను తొలగించారు. అతడిని ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

రావితో మీ సమన్వయం ఎలా ఉంది?

రాజకీయాలకు కొత్తగా వచ్చినా టీడీపీ నాయకులు ఆదరించిన తీరు అద్భుతం. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు అందిస్తున్న సూచనలు, సలహాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నా. జనసేన, బీజేపీల నుంచి నాకు పూర్తి సహకారం ఉంది.

నానిని ఎలా ఎదుర్కొంటున్నారు?

20 ఏళ్లలో నియోజకవర్గ అభివృద్ధి కంటే తన సొంత ఆర్థిక అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాడు. ఐదేళ్లకు ఒకసారి కనిపించి ఎక్కడ లేని ప్రేమను నటిస్తాడు. నోరు విప్పితే బూతులే. రౌడీమూక, కబ్జాకోరులు, గడ్డం గ్యాంగ్ అరాచకాలను జనం భరించలేకపోతున్నారు. ఇవన్నీ నాని ఓటమికి కారణాలే. ఆయన ఓటమి ప్రత్యేకమైన ప్రణాళికలు పనిలేదు. గుడివాడ ప్రజల్లో స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారు.

ఎన్ఆర్ఐ అంటూ మీ ప్రత్యర్థి విమర్శలపై మీ సమాధానం?

నా లాంటి అనామకుని చేతిలో నానికి ఓటమి భయం పట్టుకోవడంతో పిచ్చివాగుడు వాగుతున్నాడు. నేను ఎన్ఆర్ఐనని, తిరుగు టపాలో వెళ్లిపోతా అని ఏవేవో మాట్లాడుతున్నాడు. ఇక్కడే పుట్టా. ఇక్కడే చస్తా. జన్మభూమి రుణం తీర్చుకునేందుకు వచ్చా.

'ల్యాండ్ టైటిలింగ్'తో ప్రజల ఆస్తి గోవిందా!

- న్యాయ వ్యవస్థ అధికారాలను తీసుకుంటే ఎలా?
- న్యాయవాదుల ఆగ్రహం

విజయవాడ, మే 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎండల వేడి ఎంత తీవ్రంగా ఉందో ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై రాజకీయ చర్చ అంతే సెగ పుట్టిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలు ఈ చట్టాన్ని ప్రధాన విమర్శనాస్త్రంగా ప్రభుత్వంపై ఎక్కుపెడుతున్నాయి. దీనిపై ప్రభుత్వం మాత్రం నోరు మెదపడం లేదు. అనేక మంది మేధావులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వ అడుగులు ముందుకే పడుతున్నాయి. ఈ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలులోకి వస్తే ఆస్తి వివాదాలను పరిష్కరించే అధికారం ప్రభుత్వం చేతుల్లోకి వెళ్తుంది. ఇప్పటికే న్యాయస్థానాల్లో కోట్లాది పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టులో ఇప్పటి వరకు తేలని సమస్యలను ప్రభుత్వ అధికారి పరిష్కరించేస్తారా అన్నది ఒక ప్రశ్న. దీనిపై న్యాయవాదుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ప్రజల ఆస్తిని తాకట్టు పెట్టే అవకాశం ఉంది

ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమల్లోకి వస్తే ప్రజల ఆస్తిని ప్రపంచ



బ్యాంకుల్లో తాకట్టు పెట్టే అవకాశం ఉంటుంది. అథారిటీ చైర్మన్‌గా ఒక న్యాయాధికారి ఉండాలి. ప్రభుత్వం నియమించాలనుకున్న అధికారులను అథారిటీలో సభ్యులుగా నియమించుకోవచ్చు. దీనికి ప్రత్యేకంగా జుడిషియల్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి. అప్పుడు వివాదాలు, న్యాయబద్ధంగా పరిష్కారమవుతాయి. అధికారులను నియమిస్తే వారిపై రాజకీయ ఒత్తిళ్లు పనిచేస్తాయి. దీనివల్ల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది. అన్యాయం జరిగిందని బాధితులు హైకోర్టుకు వెళ్తే చాలా ఖర్చుతో కూడుకున్నది. ఒరిజినల్స్ అన్నీ ప్రభుత్వం వద్ద పెట్టుకుని, ప్రజలకు ఫొటోస్టాట్ కాపీలు ఇవ్వడం వల్ల అవకతవకలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే సివిల్ వివాదాలు పరిష్కారం కాకుండా కోట్లాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎవరి ఆస్తి మీద ఎవరికీ హక్కు లేకుండా అధికారులు పెత్తనం చేస్తారు. అథారిటీలో ఉన్న అధికారి తప్పు చేసే బాధ్యుడ్ని చేస్తామని చట్టంలో చెప్పలేదు. రెవెన్యూ శాఖలో ఇప్పటికీ అదే అమలులో ఉంది. దీనివల్ల అధికారులు మరిన్ని ఎక్కువ తప్పులు చేసే అవకాశం ఉంది.



- కిలారు బెనర్జీ, న్యాయవాది

సామాన్యులకు న్యాయం దూరమవుతుంది



ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా సివిల్ కోర్టుల పరిధిని మినహాయించడంతోపాటు సామాన్య ప్రజలకు న్యాయాన్ని దూరం చేస్తున్నారు. ఒక అథారిటీని ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారిని నియమించడం దగ్గర నుంచి, అధికారికి తప్పుడు సమాచారం ఇచ్చిన వారికి విధించే శిక్షలు, జరిమానాల వరకు అంతా లోపభూయిష్టం. రెవెన్యూ శాఖకు సంపూర్ణ హక్కులను కట్టబెట్టే విధంగా ఈ చట్టాన్ని తయారు చేశారు. సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్‌కి అనుగుణంగా కాకుండా సహజ న్యాయసూత్రాలు ప్రకారం చేస్తారని చెబుతున్నారు. అధికారికి న్యాయమని తీర్పు చెప్పేసే అధికారాలు ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా రెవెన్యూ అధికారులు టైటిల్‌ను ఖరారు చేస్తారు. ఈ చట్టం ప్రకారం ఒక ఆస్తిపై సంబంధం లేని వ్యక్తి ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. రెవెన్యూ వ్యవస్థ ఇప్పటికీ లోపభూయిష్టంగా ఉంది. అధికారులు ధనవంతులకు అనుకూలంగా మారే అవకాశాలు లేకపోలేదు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులుపై గానీ, కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై గానీ చట్టం అమలు చేసిన 30 రోజుల్లో అథారిటీకి తెలియజేయకపోతే కోర్టులో ప్రొసీడింగ్స్ ల్యాప్స్ అవుతాయి. ఇంత లోపభూయిష్టంగా ఉన్న చట్టంతో సామాన్య ప్రజానీకానికి ఎలా న్యాయం జరుగుతుంది.

- ముప్పి శ్రీకాంత్, న్యాయవాది

ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదు



లాండ్ టైటిలింగ్ చట్టం వల్ల ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు ఈ చట్టాన్ని రద్దు చేస్తామని కచ్చితంగా వాగ్దానం చేయాలి. రాజకీయ నాయకులు, అధికారులను తమ చెప్పు చేతల్లో ఉంచుకుంటే భూముల వివాదాలు పెరుగుతాయి. కక్షిదారుల స్వేచ్ఛను హరించినట్టే. ఈ భూ హక్కు చట్టం వల్ల భూ ఆక్రమణదారులకు ఊతం ఇచ్చినట్టవుతుంది. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలి

– జీవీఎల్ నరసింహారావు, న్యాయవాది



ఎక్కడా చెల్లని కాసు.. జోగి

- సొంత నియోజకవర్గం మైలవరంలో నో ఎంట్రీ
- పెడన ప్రజలు ఆదరించినా.. వారిని దోచేశారు
- ఇప్పుడు పెనమలూరు.. దోపిడీకి సిద్ధమా!
- పెడనలో పర్సంటేజీల ఎమ్మెల్యేగా పేరు
- మైలవరంలో బూడిద దోపిడీతో రూ.కోట్లు కొట్టేశారు
- పోలవరం కట్టలు.. గ్రావెల్ కొండలన్నీ కరిగించేశారు

ఎవరైనా సొంత నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటాలనుకుంటారు. కానీ ఆయన మాత్రం సొంత నియోజకవర్గ ప్రజలు ఛీ కొట్టగానే మరో నియోజకవర్గాన్ని వెతుక్కున్నారు. ఐదేళ్లపాటు అక్కడ ఇష్టారాజ్యంగా దోచుకుని అక్కడ గెలవలేమని తెలుసుకుని మరో నియోజకవర్గానికి మారారు. కొత్త ఓటర్లకు సరికొత్తగా మాయమాటలు చెప్పి గెలుపు కోసం తిప్పలు పడుతున్నారు. ఆయన ఎవరో కాదు.. జోగి రమేశ్.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : జోగి రమేశ్ 2009లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెడన నుంచి పోటీ చేసి గెలిచారు. ఐదేళ్ల సాధించింది ఏమీ లేకపోవడంతో 2014 ఎన్నికలకు సొంత నియోజకవర్గమైన మైలవరానికి మారిపోయి అక్కడ వైసీపీ తరుఫున ఓడిపోయారు. 2019లో తిరిగి పెడన నుంచి వైసీపీ తరుఫున గెలిచి 2022 ఏప్రిల్‌లో మంత్రి కూడా అయ్యారు. ఈ రెండు చోట్లా జోగి అవినీతిని చూసిన ప్రజలు ఆదరించరేమోనన్న భయంతో పెనమలూరు నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. ఈ ఎన్నికల్లో పెనమలూరు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

- మాజీ సీఎం చంద్రబాబు నివసిస్తున్న ఉండవల్లి కరకట్ట ఇంటిపై 2021 సెప్టెంబరు 17న వైసీపీ నాయకులు దాడిలో ఈ దాడిలో జోగి రమేశ్, ఆయన అనుచరులు దుర్గాప్రసాద్, నల్లమోతు జాన్, మధుపల్లి ఆనంద్‌కుమార్, మేడపాటి నాగిరెడ్డి, ఆరేపల్లి రాము, నల్లమోతు మధుతోపాటు జోగి తమ్ముడు రాము.. చంద్రబాబు ఇంటిపై దాడి చేశారు. ఈ దాడి తర్వాతే జోగిని మంత్రి పదవి వరించింది.


సొంత పార్టీ కార్యకర్తలనే బెంబేలెత్తించారు

జోగి రమేశ్ ఆగడాలతో పెడన నియోజకవర్గ ప్రజలతోపాటు సొంత పార్టీ కార్యకర్తలూ బెంబేలెత్తిపోయారు. చెరువు తవ్వకాలు మొదలు అభివృద్ధి పనుల వరకు నియోజకవర్గంలో ఏం జరిగినా అంతా ఆయన కనుసన్నల్లోనే జరగాలి. మార్కెట్‌యార్డు పాలకవర్గం, దేవాలయాల పాలకవర్గాల నియామకంలోనూ సొంత పార్టీ వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారనే విమర్శలు ఉన్నాయి. చేపలు, రొయ్యల చెరువులు తవ్వాలంటే ముందస్తుగా జోగి అనుచరులను ప్రసన్నం చేసుకుని అనుమతి తీసుకోవాలి. నైవేద్యంగా ఎకరానికి రూ.10వేలు సమర్పించుకోవాలి. చెరువుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు గత ప్రభుత్వంలో రూ.70 వేల నుంచి రూ.80 వేలు వరకు ఖర్చు అయితే జోగి అనుచరుల ట్యాక్స్ పుణ్యమా అంటూ వైసీపీ సర్కార్ హయాంలో రూ.4 లక్షలకు పైబడి ఖర్చవుతోంది.

సారా తయారీతో నెలకు రూ.10 కోట్లు



వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యనిషేధం అంటూ తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీని జోగి రమేశ్ అనుచరులు తమకు అనుకూలంగా మల్చుకున్నారు. పెడన నుంచే జిల్లావ్యాప్తంగా సారా అక్రమ రవాణా జరుగుతోంది. కాపుసారా ద్వారా నెలకు రూ.10 కోట్లపైచిలుకు సంపాదన జోగి అనుచరుల జేబులోకి వెళుతోంది.



మట్టి నుంచీ కోట్లు కొల్లగొట్టారు

మట్టి తోలకాలకు ఏడాది పాటలు పెట్టేశారు. గూడురు మండలంలో సంవత్సరానికి రూ.కోటి చెల్లిస్తే మట్టి తోలకాలకు అడ్డు ఉండదు. బంటుమిల్లి, పెడన, కృత్తివెన్ను మండలాలకు కాస్త అటుఇటుగా ఇదే రేటు ఉంటుంది. ఒకవేళ కప్పం కట్టకుండా మట్టి తోలితే వారికి అడ్డు నిలిచిన జోగి అనుచరులు గొడవలు చేస్తారు. ఆ గొడవ పోలీసు కేసులు వరకు వెళ్లేలా చేసి వేధిస్తారు. పామర్రు నియోజకవర్గం మొవ్వ మండలం చినముత్తేవిలో గత ఏడాది జనవరిలో గ్రామస్థుల రాకపోకల కోసం ఏర్పాటు చేసుకున్న బెయిలీ బ్రిడ్జి మీదుగా భారీగా మట్టిని లోడు చేసుకున్న లారీలు వెళుతుండటంతో గ్రామస్థులు వాటిని అడ్డుకున్నారు. లారీలను అడ్డుకున్న గ్రామస్థులతో దూకుడుగా వ్యవహరించిన లారీ డ్రైవర్లు మేం మంత్రి జోగి రమేశ్ మనుషులం అంటూ వారిపై నుంచి లారీలను వేగంగా పోనిచ్చారు. దీంతో గ్రామస్థులు లారీలు వెళ్లకుండా బెయిలీ బ్రిడ్జికి అడ్డంగా గడ్డర్లు వేసేశారు.

గ్రావెల్, మట్టి, వీటీపీఎస్ బూడిద.. దోపిడీ

జోగి రమేశ్ సొంత నియోజకవర్గం మైలవరం. మంత్రి అయిన తర్వాత మైలవరం నియోజకవర్గంలో గ్రావెల్, బూడిద, పోలవరం కాల్వ కట్టల మట్టిపై జోగి అనుచరుల దృష్టిపడింది. పోలవరం కాల్వ మట్టిని రాత్రిపగలు తేడా లేకుండా వందలాది లారీల్లో తరలించేసిన ఘనత జోగి అనుచరులది. పోలవరం మట్టి, గ్రావెల్ తవ్వకాల ద్వారానే సుమారు రూ.50 కోట్లు ఆర్జించినట్లు సమాచారం. వీటీపీఎస్ బూడిద దోపిడీలో జోగి అనుచరులదే కీలకపాత్ర.



అక్రమంగా మట్టి తరలింపు



తన భూమి కోసం దిగాలుగా కూర్చున్న వెంకటసుబ్బమ్మ

జడ్జి తల్లి భూమి కబ్జా

పెడన మండలం కొంకేపూడి గ్రామంలో జడ్జి తిరుమలరావుకు 5.30 ఎకరాల పొలం ఉంది. అనంతపురంలో జడ్జిగా పనిచేస్తూ తిరుమలరావు 2021లో కోవిడ్‌తో మృతి చెందారు. 2018లోనే భార్య నుంచి ఆయన విడాకులు తీసుకున్నారు. తిరుమలరావుకు కొంకేపూడిలో ఉన్న 5.30 ఎకరాలను కౌలుకు ఇచ్చి దాని ద్వారా వచ్చే ఆదాయంపై ఆయన తల్లి వెంకటసుబ్బమ్మ జీవనం సాగించేవారు. తిరుమలరావు భార్యకు, తల్లికి ఈ భూమికి సంబంధించి వివాదం కోర్టులో నడుస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి జోగి రమేశ్ అనుచరుడైన పామర్తి సాంబశివరావు అలియాస్ డికోమో సాంబ ఈ వివాదంలో జోక్యం చేసుకుని మొత్తం భూమిని తిరుమలరావు భార్య పరమయ్యేలా చూస్తానని, తనకు 1.30 ఎకరాలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు 2022 డిసెంబరులో 1.30 ఎకరాల భూమిని పామర్తి సాంబశివరావు తండ్రి అర్జునరావు పేరుతో రిజిస్టర్ కూడా చేయించేసుకున్నారు. మిగిలిన 4 ఎకరాల భూమిని మంత్రి అండతో బలవంతంగా కబ్జా చేసి తిరుమలరావు భార్యకు అప్పగించే ప్రయత్నం చేయడంతో 75 ఏళ్ల వృద్ధురాలైన తిరుమలరావు తల్లి పోలీసులను ఆశ్రయించారు. కానీ న్యాయం జరగకపోవడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉపశమనం పొందారు.